



క్రికెటర్ విరాట్ కోహ్లీకి వరాహ లక్ష్మీనృసింహస్వామి వారి చిత్రపటాన్ని అందజేస్తున్న ఆలయ ఏఈవో కె.తిరుమలేశ్వరరావు

## అప్పన్న సన్నిధిలో విరాట్ కోహ్లీ

సింహాచలంలోని వరాహలక్ష్మీ నృసింహస్వామిని భారత స్టార్ క్రికెటర్ విరాట్ కోహ్లీ ఆదివారం దర్శించుకున్నారు. ఆయనకు ఆలయ అధికారులు సంప్రదాయబద్ధంగా స్వాగతం పలికారు. అంతరాలయంలో ప్రత్యేక పూజలు చేసిన తరువాత శాలువతో సత్కరించి, స్వామివారి చిత్రపటం, ప్రసాదాలను అందజేశారు. - వార్త మెయిన్‌లో

## అసకపల్లి - లంకెలపాలెం రహదారికి మోక్షం

- రూ.2.5 కోట్లు మంజూరు చేసిన రాష్ట్ర ప్రభుత్వం



అసకపల్లి- లంకెలపాలెం రహదారిని పరిశీలిస్తున్న ఆర్‌అండ్‌బీ చీఫ్ ఇంజనీర్ శ్రీనివాసరెడ్డి, ఎస్ఈ జాన్‌సుధాకర్, జేఈ బాలరాజు

సబ్బవరం, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అసకపల్లి-లంకెలపాలెం రహదారికి ఎట్టకేలకు మోక్షం కలిగింది. వైసీపీ పాలనలో పూర్తి నిరాదరణకు గురైన ఈ రోడ్డు అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం రూ.2.5 కోట్లు మంజూరు చేసింది. ఆర్‌అండ్‌బీ చీఫ్ ఇంజనీర్ ఎల్.శ్రీనివాసరెడ్డి, ఎస్ఈ కె.జాన్‌సుధాకర్, జేఈ బాలరాజు ఆదివారం అసకపల్లి- లంకెలపాలెం మధ్య రోడ్డును పరిశీలించారు. ఈ సందర్భంగా చీఫ్ ఇంజనీర్ శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ, త్వరలో టెండర్లు ఖరారు చేసి రోడ్డు అభివృద్ధి పనులు ప్రారంభిస్తామని చెప్పారు.

## విలేజ్ హెల్త్ క్లినిక్‌ల భవనాలకు రూ.6.18 కోట్లు

- ఎమ్మెల్యే పంచకర్ల

పరవాడ, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : పెందుర్తి నియోజకవర్గంలోని పరవాడ, సబ్బవరం మండలాల్లో అసంపూర్తిగా ఉన్న విలేజ్ హెల్త్ క్లినిక్‌లు, బ్లాక్ పబ్లిక్ హెల్త్ యూనిట్స్ భవన నిర్మాణాలను పూర్తి చేసేందుకు ప్రభుత్వం రూ. 6.18 కోట్లు మంజూరు చేసిందని ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు ఒక ప్రకటనలో తెలిపారు. సబ్బవరం మండలంలో 13 విలేజ్ హెల్త్ క్లినిక్‌లు, పరవాడ మండలంలో ఎనిమిది విలేజ్ హెల్త్ క్లినిక్‌ల భవన నిర్మాణాల కోసం ఉపాధి హామీ పథకం కింద నిధులు సమకూర్చినట్టు పేర్కొన్నారు. ఆయా నిర్మాణాలను త్వరగా పూర్తి చేసి అందుబాటులోకి తీసుకువస్తామని తెలిపారు.

# పరాయి పంచన పాట్లు

## అద్దె భవనాల్లో జిల్లాస్థాయి ప్రభుత్వ కార్యాలయాలు

- ఇరుకు వసతితో ఉద్యోగులు, సందర్శకులకు అసౌకర్యం
- పట్టణానికి దూరంగా కలెక్టరేట్, ఎస్పీ ఆఫీస్
- రాకపోకలకు ప్రజలు, ఉద్యోగుల ఇక్కట్లు
- అపార్టుమెంట్లు, ప్రైవేటు భవనాల్లో పలు శాఖల కార్యాలయాలు
- కొత్త జిల్లా ఏర్పడి మూడున్నరేళ్లయినా సొంతగూడుకు నోచుకోని దుస్థితి

ఆంధ్రజ్యోతి పరిశీలన



ఒక అపార్టుమెంట్ సెల్లార్‌లో వాచ్‌మన్‌కు కేటాయించిన గదిలో ఏర్పాటు చేసిన జిల్లా బీసీ, సాధికార అధికారి కార్యాలయం

(అనకాపల్లి-ఆంధ్రజ్యోతి)

**కొత్త జిల్లాలు ఏర్పాటై మూడున్నరేళ్లు దాటినా.. ఇంకా బాలారిష్టాలు తొలగలేదు. జిల్లా కేంద్రంగా ఏర్పడిన అనకాపల్లిలో ఎటువంటి ఎదుగుబొదుగూ లేదు. పరిపాలనకు కేంద్ర బిందువైన కలెక్టరేట్‌తోపాటు జిల్లా పోలీసు కార్యాలయం, ఇంకా పలు ప్రభుత్వ కార్యాలయాలు సొంతగూడుకు నోచుకోక, పరాయి పంచన నడుస్తున్నాయి. అత్యధిక శాతం ప్రభుత్వ కార్యాలయాలు అరకొర వసతుల నడుమ అద్దె భవనాల్లో కొనసాగుతున్నాయి. దీంతో ఉద్యోగులు, వివిధ పనుల నిమిత్తం వచ్చే ప్రజలు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు.**



దుకాణ సముదాయంపై జిల్లా ఖజానా అధికారి కార్యాలయం



అద్దె భవనంలో ఎక్సైజ్ సూపరింటెండెంట్ కార్యాలయం

పరిపాలన వికేంద్రీకరణ పేరుతో గత వైసీపీ ప్రభుత్వం 2022 ఏప్రిల్‌లో జిల్లాలను పునర్విభజించిన విషయం తెలిసిందే. ఉమ్మడి విశాఖ జిల్లాలో అనకాపల్లి కేంద్రంగా 24 మండలాలు, రెండు మునిసిపాలిటీలతో కొత్త జిల్లా ఏర్పడింది. అప్పటి ప్రభుత్వం ముందస్తు ప్రణాళిక లేకుండా హడావిడిగా కొత్త జిల్లాలను ఏర్పాటుచేసింది తప్ప.. జిల్లాస్థాయి ప్రభుత్వ కార్యాలయాలకు సొంత భవనాలు, మౌలిక సదుపాయాలు కల్పించలేదు. కొత్త జిల్లాలు ఏర్పడిన తరువాత రెండేళ్లపాటు వైసీపీ అధికారంలో వున్నప్పటికీ అనకాపల్లి జిల్లా ఒక్క ప్రభుత్వ శాఖకు కూడా నూతన భవనం నిర్మించలేదు. కనీసం భవనాల నిర్మాణానికి స్థలం కూడా కేటాయించలేదు. దీంతో మూడున్నరేళ్ల నుంచి ప్రభుత్వ కార్యాలయాలు అరకొర వసతుల నడుమ అద్దె భవనాల్లో కొనసాగుతున్నాయి. పరిపాలనకు కేంద్ర బిందువైన జిల్లా కలెక్టర్ కార్యాలయాన్ని, జిల్లా పోలీసు (ఎస్పీ) కార్యాలయాన్ని అప్పట్లో అనకాపల్లి పట్టణానికి సుమారు నాలుగు కిలోమీటర్ల దూరంలోని శంకరం పంచాయతీలో ఒక ప్రైవేటు విద్యా సంస్థకు చెందిన భవన సముదాయాల్లో ప్రారంభించారు. ఈ కార్యాలయాలు లూప్‌లైన్‌లో వుండడంతో సర్వీసు ఆటోలు వుండవు. దీంతో వివిధ మండలాల ప్రజలు జిల్లా కేంద్రానికి వచ్చి, అక్కడి నుంచి ఆటో మాట్లాడుకుని కలెక్టర్, ఎస్పీ కార్యాలయాలకు వెళ్లాల్సి వస్తున్నది.

పౌరసరఫరాల శాఖ, జిల్లా నీటి యాజమాన్య సంస్థ కార్యాలయాలు కూడా ఇక్కడే వున్నాయి. రాష్ట్ర ప్రభుత్వ శాఖల కార్యాలయాలు 45 వరకు ఉండాగా వీటిలో సుమారు 30 శాఖల కార్యాలయాలు అద్దె భవనాల్లో నడుస్తున్నాయి. మిగిలిన శాఖలకు గతంలో వున్న డివిజన్ స్థాయి కార్యాలయాల్లోనే జిల్లాస్థాయి కార్యాలయాలను నిర్వహిస్తున్నారు.

జిల్లా బీసీ సంక్షేమ, సాధికార అధికారి కార్యాలయాన్ని అనకాపల్లి పట్టణంలోని ఒక అపార్టుమెంట్ సెల్లారులో వాచ్‌మన్ కోసం నిర్మించిన గదిలో నిర్వహిస్తున్నారు. జిల్లా పంచాయతీ అధికారి కార్యాలయాన్ని శంకరం గ్రామంలోని ఒక సామాజిక భవనంలో ఏర్పాటు చేశారు. గృహ నిర్మాణ సంస్థ పీడీ కార్యాలయం, దేవదాయ, వ్యవసాయ, వాణిజ్య పన్నులు, జిల్లా స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్లు, స్త్రీ శిశు సంక్షేమ, గనుల శాఖల కార్యాలయాల కోసం పట్టణంలోని వివిధ ప్రాంతాల్లో ప్రైవేటు అపార్టుమెంట్లలో ఫ్లాట్‌లను అద్దెకు తీసుకున్నారు. ఈపీడీసీఎల్ కార్యాలయాన్ని ఒక ప్రైవేటు దుకాణ సముదాయంలో ఏర్పాటు చేశారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం చదరపు అడుగుకు నెలకు రూ.10 చొప్పున అద్దె చెల్లిస్తుంది. ఇక్కడ సాధారణ అద్దెలతో పోలిస్తే ప్రభుత్వం చెల్లించే అద్దె తక్కువగా వుండడంతో ప్రభుత్వ కార్యాలయాలకు పట్టణంలో అద్దె భవనాలు లభించని పరిస్థితి ఏర్పడింది. దీంతో ... మిగతా 6వ పేజీలో

## గంజాయి కట్టడిపై డేగ కన్ను

- రవాణా, వినియోగం నిర్మూలనే లక్ష్యంగా పోలీసు శాఖ అడుగులు
- డ్రోన్ కెమెరాలతో నిఘా, తనిఖీలు



రోలుగుంట మండలంలో గంజాయి రవాణాపై డ్రోన్ కెమెరాతో నిఘా పెట్టిన పోలీసులు

(అనకాపల్లి-ఆంధ్రజ్యోతి)

యువత బంగారు భవిష్యత్తును నాశనం చేస్తున్న గంజాయి రవాణా, వినియోగాన్ని పూర్తిగా కట్టడి చేసేందుకు ప్రభుత్వం పటిష్ఠ చర్యలు చేపట్టింది. ప్రధానంగా ఒడిశా నుంచి అల్లూరి సీతారామరాజు జిల్లా మీదుగా మైదాన ప్రాంతానికి గంజాయి రవాణా అవుతున్న అనకాపల్లి జిల్లాపై ప్రత్యేక దృష్టి సారించింది. ఈ మేరకు రాష్ట్ర హోం శాఖ నుంచి జిల్లా పోలీసు యంత్రాంగానికి స్పష్టమైన మార్గదర్శకాలు జారీ అయ్యాయి. దీంతో పోలీసులు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించి గంజాయి రవాణా, నిల్వదారుల కదలికలపై నిఘా పెట్టారు. ఎస్పీ తుహిన్‌సిన్హా నేతృత్వం జిల్లాలో గంజాయి రవాణా, మాదకద్రవ్యాల వినియోగాన్ని సమూలంగా నిర్మూలించేందుకు చర్యలు చేపట్టారు. ప్రత్యేక నిఘా వర్గాల ద్వారా ఎప్పటికప్పుడు అందుతున్న సమాచారం మేరకు ఆకస్మిక తనిఖీలు జరుపుతున్నారు. డ్రోన్ల సాయంతో గంజాయి రవాణా జరిగే అవకాశాలున్న రోలుగుంట మండల పరిధిలోని పెదపేట, ఎం.కె.పట్నం రహదారుల్లో ... మిగతా 6వ పేజీలో

# కొళాయిల్లో బురద నీరు

## చోడవరం పంచాయతీ అధికారుల నిర్లక్ష్యం

- అధ్వానంగా తయారైన తాగునీటి సరఫరా

చోడవరం, డిసెంబరు7 (ఆంధ్రజ్యోతి): **స్థానిక మేజర్ పంచాయతీలో ప్రజలకు తాగునీటి కష్టాలు తప్పడం లేదు. తాగునీటి సరఫరా సరిగ్గా లేకపోవడడం, సరఫరా అయిన నీరు బురదగా వుండడం పరిపాటిగా మారింది. పంచాయతీ అధికారుల నిర్లక్ష్యమే ఇందుకు కారణమని స్థానికులు ఆరోపిస్తున్నారు.**





బానయ్య కోనేరు ప్రాంతంలో కొళాయిల నుంచి వస్తున్న బురద నీరు

చోడవరం పట్టణంలో కొంతకాలం నుంచి తాగునీటి సరఫరా వ్యవస్థ దయనీయంగా వుంది. ప్రజలకు కొళాయిల ద్వారా రక్షిత తాగునీటి సరఫరా కోసం జన్నవరం నుంచి ప్రత్యేకంగా పైపులైన్లు ఏర్పాటు చేసి స్థానికంగా ఉన్న ఆరు ఓవర్‌హెడ్ ట్యాంకుల ద్వారా సరఫరా చేస్తున్నారు. అయితే నీటిని శుద్ధి చేయకుండా నేరుగా కొళాయిల ద్వారా సరఫరా చేస్తున్నారని, దీంతో ఒక్కోసారి బురద నీరు వస్తున్నదని స్థానికులు ఆరోపిస్తున్నారు. రోజూ ఏదో ఒక వీధిలో కొళాయిల నీరు బురదగా లేదంటే కలుషితంగా వస్తుండడంతో తాగునీటి కోసం ఇబ్బంది పడుతున్నారు. రక్షిత మంచినీటి పథకాల నిర్వహణ సరిగా లేకపోవడంతోపాటు, ట్యాంకులలోకి ఎక్కే నీరు కూడా ఫిల్టర్ కాకపోవడంతో ఈ పరిస్థితి ఏర్పడిందని అభిప్రాయపడుతున్నారు. దీనికి తోడు ట్యాంకులను శుభ్రం చేయకపోవడం, క్లోరినేషన్ చేయకపోవడంతో కలుషిత నీరు తాగి రోగాల బారినపడతున్నాయని వాపోతున్నారు. పంచాయతీలో తాగునీటి సరఫరాకు సిబ్బంది ఉన్నప్పటికీ, రోజూ ఎక్కడో ఒకచోట పైపులు లీకు కావడం లేదంటే మోటార్లు కాలిపోవడం వంటి సమస్యలతో ... మిగతా 6వ పేజీలో

# ఉపమాక ఆలయంలో నిత్య కల్యాణోత్సవం

## పదేళ్ల తరువాత పునరుద్ధరణ

- స్వామివారికి లక్ష తులసి పూజ
- గోదాదేవికి లక్ష కుంకుమార్చన



ఆలయంలో నిత్య కల్యాణోత్సవం జరిపిస్తున్న అర్చకులు, వేద పండితులు. (ఇన్‌సెట్‌లో) నిత్యకల్యాణం అనంతరం భక్తులకు దర్శనమిస్తున్న స్వామివారు



గోదాదేవి అమ్మవారికి లక్ష కుంకుమార్చన చేస్తున్న అర్చకులు

నక్కపల్లి, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఉపమాక క్షేత్రంలో సుమారు పదేళ్ల తరువాత నిత్య కల్యాణోత్సవాలు పునఃప్రారంభం అయ్యాయి. ఉభయదేవేరులతో కూడిన స్వామివారి ఉత్సవమూర్తులను ఆలయ ప్రాకారంలో వుంచి అర్చకులు, వేదపండితుల బృందం నిత్య కల్యాణోత్సవాన్ని ఘనంగా జరిపించింది. భక్తుల గోవిందనామస్మరణతో ఆలయం మార్మోగింది. తొలుత పూర్ణకుంభంతో ప్రాకార సేవ జరిపారు. అనంతరం క్షేత్రపాలకుడు వేణుగోపాలస్వామి మూలవిరాట్‌కు పంచామృతాభిషేకాలు, లక్ష తులసిపూజ చేశారు. తరువాత గోదాదేవి అమ్మవారి సన్నిధి వద్ద లక్ష కుంకుమార్చన నిర్వహించారు. ఈ ఆలయాన్ని టీటీడీ స్వాధీనం చేసుకున్న తరువాత (2015 నవంబరు) నుంచి నిత్య కల్యాణోత్సవాలను ఆపేశారు. అంతకుముందు మొక్కుబడులున్న భక్తులు, ఇళ్లల్లో వివాహాది శుభకార్యాలు జరిగినప్పుడు, నూతన గృహాలు నిర్మించుకున్నప్పుడు స్వామివారి ఆలయంలో కనీస రుసుముతో నిత్య కల్యాణోత్సవాలు జరుపుకునేవారు. పదేళ్ల తరువాత నిత్య కల్యాణోత్సవాలను పునఃప్రారంభించడంతో భక్తులు సంతోషాన్ని వ్యక్తం చేస్తున్నారు. ఈ కార్యక్రమాల్లో ఆలయ ప్రధానార్చకుడు గొట్టుముక్కల ప్రసాదాచార్యులు, అర్చకులు సంకర్షణపల్లి కృష్ణమాచార్యులు, పీసపాటి శేషాచార్యులు, నండూరి రాజగోపాలాచార్యులు, ఆలయ ఇన్‌స్పెక్టర్ కూర్మేశ్వరరావు, సిబ్బంది, శ్రీవారి సేవకులు పాల్గొన్నారు.

# మన్యంలో పర్యాటక సందడి

## సందర్శనీయ ప్రదేశాలు కిటకిట

- వంజంగి, మాడగడ మేఘాల కొండల వద్ద రద్దీ
- వాతావరణం అనుకూలించడంతో తరలివస్తున్న పర్యాటకులు



కొత్తపల్లి జలపాతం వద్ద పర్యాటకులు



వంజంగి మేఘాల కొండపై సందర్శకులు

పాడేరు, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): మన్యంలో సందర్శనీయ ప్రదేశాలకు ఆదివారం పర్యాటకులు పోటెత్తారు. కార్తీక మాసం ముగిసినప్పటికీ వాతావరణం అనుకూలించడంతోపాటు ప్రకృతి అందాలు మరింత సుందరంగా దర్శనమిస్తుండడంతో అధిక సంఖ్యలో జనం మన్యం బాట పడుతున్నారు. దీంతో ఏజెన్సీలో ఎక్కడ చూసినా పర్యాటకులే కనిపించారు. ఇటు బొర్రా గుహలు మొదలుకుని అటు లంబసింగి వరకు సందడి నెలకొంది. అనంతగిరి మండలంలో బొర్రా గుహలు, కటికి, తాడిగుడ జలపాతాలు, అరకులోయ మండలంలో మాడగడ మేఘాల కొండ, గాలికొండ వ్యూపాయింట్, సుంకరమెట్ట ఉడెన్‌బ్రిడ్జి, గిరిజన మ్యూజియం, పద్మాపురం ఉద్యానవనం, గిరి గ్రామదర్శిని, ఆయా ప్రాంతాల్లోని వలిసెలు పూల తోటలు, డుంబ్రిగుడ మండలంలో చాపరాయి జలవిహారి, పాడేరు మండలంలో మోదాపల్లి కాఫీ తోటలు, వంజంగి హిల్స్, జి.మాడుగుల మండలంలో కొత్తపల్లి జలపాతం, చింతపల్లి మండలంలో తాజంగి రిజర్వాయర్, చెరువువేనం మేఘాల కొండ, లంబసింగి, యర్రవరం జలపాతం తదితర ప్రాంతాలను పర్యాటకులు సందర్శించారు.

వంజంగి మేఘాలకొండను సందర్శించేందుకు వివిధ ప్రాంతాల నుంచి పర్యాటకులు శనివారం సాయంత్రానికే పాడేరు చేరుకున్నారు. రాత్రికి అక్కడ రాత్రి బస చేసి ఆదివారం తెల్లవారుజామున వంజంగి మేఘాల కొండకు చేరుకున్నారు. మంచు అందాలను చూసి మైమరిచిపోయారు. ఆంధ్ర కశ్మీర్ లంబసింగికి పర్యాటకుల తాకిడి భారీగా పెరిగింది. మంచు అందాలను వీక్షించేందుకు భారీ సంఖ్యలో పర్యాటకులు తరలి వచ్చారు. తాజంగి జలాశయంలో సాహస క్రీడలు, బోటు షికారుకు సందర్శకులు ఆసక్తి చూపారు.

## ఎన్‌ఎంఎంఎస్ పరీక్షకు 3,857 మంది హాజరు

అనకాపల్లి, నర్సీపట్నంలో 17 కేంద్రాల్లో నిర్వహణ



నర్సీపట్నంలోని ఒక కేంద్రంలో ఎన్ఎంఎంఎస్ అర్హత పరీక్షకు హాజరైన విద్యార్థులు

అనకాపల్లి టౌన్/ నర్సీపట్నం, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో అనకాపల్లి, నర్సీపట్నంలో ఆదివారం జరిగిన 'నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్ -2025' పరీక్షకు 3,857 మంది విద్యార్థులు హాజరైనట్టు జిల్లా విద్యాశాఖాధికారి గిడ్డి అప్పారావునాయుడు తెలిపారు. మొత్తం 17 పరీక్షా కేంద్రాల్లో 3,994 మంది పరీక్ష రాయాల్సి వుండగా 3857 (96.57 శాతం) మంది హాజరయ్యారని ఆయన తెలిపారు. నర్సీపట్నంలోని వివిధ కేంద్రాలకు 1,978 మంది విద్యార్థులకుగాను 1,906 మంది హాజరయ్యారు. పరీక్షల పర్యవేక్షణకు నియమించిన రెండు స్క్వాడ్ బృందాలు 12 కేంద్రాలను, తాను ఐదు కేంద్రాలు సందర్శించినట్టు పేర్కొన్నారు. ఎన్ఎం ఎంఎస్ అర్హత పరీక్షల ప్రశాంత వాతావరణంలో జరిగిందని డీఈవో తెలిపారు.

# ఉత్సాహంగా ఘంటసాల రాష్ట్రస్థాయి పాటల పోటీలు

- విజేతలకు బహుమతులు అందజేసిన మాజీ ఎమ్మెల్సీ పప్పల
- సీనియర్స్ విభాగంలో ప్రథమ విజేత హరిణి
- జూనియర్స్ విభాగంలో కొండపల్లి శ్రీప్రజ్ఞ

ఎలమంచిలి, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): ఎలమంచిలి పట్టణంలో ఆదివారం నిర్వహించిన ఘంటసాల రాష్ట్రస్థాయి పాటల పోటీలు ఉత్సాహ భరితం జరిగాయి. గానగంధర్వుడు ఘంటసాల వేంకటేశ్వరరావు 103వ జయంతిని పురస్కరించుకుని స్థానిక ఘంటసాల కల్చరల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన ఈ పోటీల్లో 40 గాయనీ, గాయకులు పాల్గొన్నారు. ఈ పోటీలను ఆదివారం ఉదయం ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ ప్రారంభించారు. తొలుత ఘంటసాల చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే విజయకుమార్ మాట్లాడుతూ ఘంటసాల వేంకటేశ్వరరావు మహనీయుడన్నారు. ఎమ్మెల్యేని కాకముందు తానొక గాయకుడిని అన్నారు. చదువుకునే రోజుల్లో పాటలు, కళలు అన్నా చాలా మక్కువ అన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఒక పాటలోని చరణం పాడి ఆకట్టుకున్నారు. సాయంత్రం జరిగిన బహుమతి ప్రధానోత్సవానికి మాజీ ఎమ్మెల్యే పప్పల చలపతిరావు, యాదవ కార్పొరేషన్ డైరెక్టరు దూళి రంగనాయకులు, టీడీపీ నేతలు గొర్లె నానాజీ, కరణం రవికుమార్ ముఖ్య అతిథిలుగా హాజరయ్యారు.


ఘంటసాల పాటల పోటీల్లో ప్రథమ విజేత శ్రీపజ్ఞకు షీల్డ్ అందజేస్తున్న మాజీ ఎమ్మెల్సీ పప్పల చలపతిరావు, నిర్వాహకులు

ఈ సందర్భంగా చలపతిరావు మాట్లాడుతూ గానగంధర్వుడు ఘంటసాల సేవలు చారిత్రాత్మకమన్నారు. ఘంటసాల పేరు మీద ప్రతి ఏటా ఎలమంచిలిలో ఇటువంటి కార్యక్రమాలు ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. అనంతరం విజేతలకు చలపతిరావు బహుమతులు అందజేశారు. సీనియర్ విభాగంలో ప్రథమ విజేతగా నక్కపల్లికి చెందిన శ్రీహరిణి, ద్వితీయ స్థానం సీహెచ్.అప్పారావు(చోడవరం), తృతీయ స్థానం డి. జగదీశ్వరి (మునగపాక), జూనియర్స్ విభాగంలో ప్రథమ విజేతగా కొండపల్లి శ్రీప్రజ్ఞ,


ఘంటసాల చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే విజయకుమార్

ద్వితీయ స్థానం ఎ. మణిదీపిక, తృతీయ స్థానం డి.మౌనిక విజేతలుగా నిలిచారని నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా పప్పల చలపతిరావు, దూలి రంగనాయకులను నిర్వాహకులు సత్కరించారు. కార్యక్రమంలో రాష్ట్రపతి అవార్డు గ్రహీత, విశ్రాంత ఉపాధ్యాయుని సావిత్రమ్మ, పెన్షనర్స్ సంఘాధ్యక్షుడు సీహెచ్. సోమేశ్వరరావు, కూటమి నేతలు ఇన్‌చార్జి ఎంపీపీ రాజాన శేష, బొద్దపు శ్రీను, ఆడారి శ్రీధర్, కొఠారు శ్రీను, వూటకూటి రమేశ్, స్థానికులు కొఠారు కొండబాబు, రామకృష్ణ, సున్నం నాగు పాల్గొన్నారు.

## ఘనంగా ఖాదర్‌వల్లీ ఉర్సు ఉత్సవం


పెదబోదిగల్లంలో ఉర్సు సందర్భంగా అశ్వాన్ని ఊరేగిస్తున్న దృశ్యం

నక్కపల్లి, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెదబోదిగల్లంలో ఆదివారం ఖాదర్‌వల్లీ ఉర్సు ఘనంగా నిర్వహించారు. ఈ పండుగను గ్రామస్థులంతా భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ఉర్సు గొప్పతనం గురించి మత పెద్దలు వివరించారు. అశ్వంపై బావుటాలు ఎగురవేసి పురవీధుల్లో ఊరేగించారు. మసీదుల వద్ద ప్రత్యేక ప్రార్థనలు చేశారు. గ్రామంలో పండుగ వాతావరణం ఏర్పడింది.

## క్రమశిక్షణతో చదువుకోవాలి : ఎమ్మెల్యే సుందరపు


మెరిట్ విద్యార్థులకు చెక్కుని అందజేస్తున్న ఎమ్మెల్యే సుందరపు

అచ్యుతాపురం, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకోవాలని ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ అన్నారు. ఆదివారం జరిగిన స్థానిక కైట్స్ విద్యాసంస్థల వార్షికోత్సవంలో ఆయన మాట్లాడుతూ అచ్యుతాపురంలో భవిష్యత్‌లో ఉపాధి అవకాశాలు చాలా ఎక్కువగా ఉంటాయని, అందువల్ల విద్యార్థులు దురలవాట్లకు దూరంగా ఉండి చదువుపైనే దృష్టిపెట్టాలన్నారు. పరవాడ డీఎస్పీ విష్ణు స్వరూప్ మాట్లాడుతూ విద్యార్థులు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలన్నారు. ఈసందర్భంగా మెరిట్ విద్యార్థులకు రూ.పది వేలు చొప్పున ప్రోత్సాహక బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో కరస్పాండెంట్ రెడ్డి చిరంజీవి, సీఐ చంద్రశేఖర్, మాజీ సర్పంచ్ రెడ్డి అప్పలనాయుడు, కూండ్రపు వెంకునాయుడు, డ్రీమ్స్ నాయుడు, రెడ్డి గణేష్, తదితరులు పాల్గొన్నారు

## యూటీఎఫ్ మండల కార్యవర్గం

అచ్యుతాపురం, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ అచ్యుతాపురం మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా ఆర్. రవికుమార్, ఎం.సూర్యలక్ష్మి ఎన్నికయ్యారు. ఆదివారం మండలంలోని కోనెంపాలెంలో నూతన కార్యవర్గ ఎన్నికలు జరిగాయి. జిల్లా అధ్యక్షురాలు వాత్సవాయి శ్రీలక్ష్మి ఆధ్వర్యంలో జరిగిన ఈ ఎన్నికల్లో గౌరవాధ్యక్షునిగా మారిశెట్టి వెంకట అప్పారావు, ఆడిట్ కన్వీనర్‌గా పీటర్ పాల్, కార్యదర్శులుగా కమల, సుహాసిని, కృష్ణకుమారి, టీపీ సత్యనారాయణ, హిమశ్రీ, ఉత్తంకుమార్ ఎన్నికయ్యారు.

## సముద్రపు ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్ పట్టివేత

రాంబిల్లి, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వాడరాంబిల్లి సముద్రతీరం వద్ద ఎటువంటి అనుమతులు లేకుండా సముద్రపు ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్‌ను శనివారం రాత్రి పట్టుకున్నట్టు సీఐ సీహెచ్ నరసింగరావు ఆదివారం తెలిపారు. అందిన ఫిర్యాదుల మేరకు శనివారం రాత్రి తమ సిబ్బంది దాడి చేసి ట్రాక్టర్‌ని పట్టుకున్నట్టు చెప్పారు. ట్రాక్టర్‌ను తహశీల్దార్‌కు అప్పగించామన్నారు. ఎటువంటి అనుమతులు తీసుకోకుండా సముద్ర తీరంలో ఇసుకను తరలిస్తే చర్యలు తప్పవని సీఐ హెచ్చరించారు.

## టెన్త్ విద్యార్థులకు నమూనా పరీక్ష

ఎలమంచిలి, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): ఎలమంచిలి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఆదివారం పదో తరగతి విద్యార్థులకు అఖిల భారత విద్యార్థి సమైఖ్య (ఏఐఎస్ఎఫ్) ఆధ్వర్యంలో నమూనా పరీక్ష నిర్వహించినట్టు జిల్లా అధ్యక్షుడు బి.బాబ్జీ తెలిపారు. ఎలమంచిలిలో నిర్వహించిన ఈ పరీక్షలో 498 మంది విద్యార్థులు పాల్గొన్నారన్నారు. ఈ పరీక్షలో ప్రతిభ కనబర్చిన 10 మందిని న్యాయనిర్ణేతల సమక్షంలో ఎంపిక చేసి బహుమతులు అందజేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ ప్రతినిధులు రాజు, అజయ్, సంతోష్, ప్రసాద్, ఆనంద్, లక్ష్మణ్ పాల్గొన్నారు.

## కొక్కిరాపల్లిలో యువకుల శ్రమదానం

ఎలమంచిలి, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): మునిసిపాలిటీలోని కొక్కిరాపల్లిలో గ్రామజ్యోతి యువకులు ఆదివారం నూకాంబిక చెరువు గట్టుపై వ్యర్థాలను శ్రమదానంతో తొలగించారు. చెరువు గట్టుపై ఉన్న తుప్పలు, మొక్కలు తొలగించారు. దీంతో చెరువు గట్టు అందంగా తయారైంది.

## యువత మత్తుపదార్థాలకు దూరంగా ఉండాలి

పాయకరావుపేట రూరల్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): యువత మత్తుపదార్థాలకు దూరంగా ఉండాలని ఎస్ఐ పురుషోత్తం అన్నారు. ఆదివారం మండలంలోని అరట్లకోటలో స్పేసెస్ డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ విద్యార్థులు నిర్వహించిన 'మాదకద్రవ్యాలకు నో చెప్పండి' ర్యాలీని ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో పీవో పి.భాస్కరరావు, సర్పంచ్ అప్పలనర్స, వేముల వెంకటేశ్వరరావు, ఎన్ఎస్ఎస్ విద్యార్థులు పాల్గొన్నారు.

# శిథిల స్థితిలో ఉన్న పాఠశాల భవనం తొలగింపు

పాయకరావుపేట, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): స్థానిక లింగాలతోట కాలనీలోని ప్రాథమిక పాఠశాలలో శిథిల స్థితికి చేరుకున్న భవనాన్ని ఆదివారం టీడీపీ పట్టణ అధ్యక్షుడు యాళ్ల వరహాలబాబు ఆర్థిక సాయంతో తొలగించారు. ఈ సందర్భంగా వరహాలబాబు మాట్లాడుతూ శిథిల స్థితికి చేరుకున్న భవనంలో పాములకు నిలయంగా మారిందన్నారు. ఇది తెలియని చిన్న పిల్లలు తరచూ ఆ తరగతి గదిలోకి వెళుతుండడంతో తల్లిదండ్రులు భయపడుతున్నారన్నారు. ఈ భవనాన్ని తొలగించాలని కాలనీవాసుల విజ్ఞప్తి మేరకు అధికారుల దృష్టికి తీసుకెళ్లామన్నారు. ఇంజనీరింగ్ అధికారుల ఆదేశాల మేరకు ఈ భవనాన్ని తొలగించామన్నారు. విద్యా శాఖ వద్ద నిధులు లేనందున తన సొంత నిధులతో పాఠశాల భవనం కూల్చే పనులు చేపట్టామని వరహాలబాబు తెలిపారు. ఈ ప్రదేశంలో కొత్త తరగతి గది నిర్మాణానికి నిధులను రాష్ట్ర హోం మంత్రి అనిత మంజూరు చేయనున్నారని


లింగాలతోటకాలనీలో శిథిల స్థితిలో ఉన్న పాఠశాల భవనాన్ని తొలగిస్తున్న దృశ్యం

ఆయన తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, టీడీపీ నాయకులు వీసం మహేష్, జూరెడ్డి ప్రసాద్, లెక్కల గోవిందు, రాజాన ఆది పాల్గొన్నారు.

# టెన్త్‌లో శతశాతం ఉత్తీర్ణత సాధించాలి : డిప్యూటీ డీఈవో

నక్కపల్లి, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): మార్చి నెలలో జరగనున్న పదో తరగతి పరీక్షల్లో మండలంలోని అన్ని హైస్కూళ్లు నూరుశాతం ఫలితాలు సాధించాలని జిల్లా ఉప విద్యాశాఖాధికారి పెన్నాడ అప్పారావు చెప్పారు. ఆదివారం స్థానిక కేజీబీవీలో టెన్త్ విద్యార్థుల అదనపు తరగతులను ఆయన పరిశీలించారు. పదో తరగతి చదువుకుంటున్న బాలికలను పలు ప్రశ్నలు అడిగి సంతృప్తికరమైన సమాధానాలు రాబట్టారు. వంద రోజుల యాక్షన్ ప్లాన్ అన్ని హైస్కూళ్లల్లో అమలుచేయాలని ఎంఈవో కె.నరేశ్‌కు సూచించారు. అదనపు తరగతులతో వెనుకబడిన విద్యార్థులకు ఎంతో మేలు జరుగుతుందని కేజీబీవీ ఎస్‌వో సలీమాకు సూచించారు. కేజీబీవీ బాలికలు జిల్లాలో టాపర్‌లుగా నిలవాలన్నారు. మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. దేవవరం జడ్పీ హైస్కూల్‌లో అదనపు తరగతులను ఎంఈవో కె.నరేశ్ పరిశీలించారు. ఆయన వెంట తెలుగు పండిట్ ఎన్‌వీఎస్ ఆచార్యులు ఉన్నారు.


టెన్త్ బాలికలతో మాట్లాడుతున్న జిల్లా ఉప విద్యాశాఖాధికారి అప్పారావు

## భక్తిశ్రద్ధలతో పరదేశమ్మ బోనాల జాతర

ఎలమంచిలి, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని యర్రవరంలో ఆదివారం పరదేశమ్మ బోనాల జాతరను భక్తులు భక్తిశ్రద్ధలతో ఘనంగా జరుపుకున్నారు. పరదేశమ్మ భవానీల పీఠం ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో మహిళలు వివిధ రకాల పిండివంటలు, పండ్లు, స్వీట్లు, బోనాలను ఊరేగించారు. అనంతరం అమ్మవారికి బోనాలు సమర్పించుకున్నారు. ఈ కార్యక్రమంలో గ్రామస్థులు, భవానీ భక్తులు పాల్గొన్నారు.


యర్రవరంలో పరదేశమ్మ బోనాలను ఊరేగిస్తున్న భక్తులు

## రేగుపాలెంలో వందేమాతరం ర్యాలీ

ఎలమంచిలి, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి):మండలంలోని రేగుపాలెంలో దేశభక్తి పెంపొందించేందుకు ఎన్ఎస్ఎస్ విద్యార్థులు ఆదివారం వందేమాతరం ఆలపిస్తూ ర్యాలీ నిర్వహించారు. ఎలమంచిలి గురజాడ అప్పారావు ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు చెందిన ఎన్ఎస్ఎస్ యూనిట్-1 విద్యార్థులు రేగుపాలెంలో, యూనిట్-2 విద్యార్థులు లైనుకొత్తూరులో సేవా కార్యక్రమాలు నిర్వహించారు. ఆదివారం ఐదో రోజు వందేమాతరం గీతానికి 150 ఏళ్లు పూర్తయిన సందర్భంగా గ్రామంలోని వీధుల్లో వందేమాతరం ఆలపించారు. కార్యక్రమాల్లో ఎన్ఎస్ఎస్ పీవోలు డాక్టర్ వి. చిట్టిబాబు, డాక్టర్.అర్జున అప్పారావు పాల్గొన్నారు.

## టెన్త్ విద్యార్థులకు ప్రత్యేక తరగతులు ప్రారంభం

పాయకరావుపేట, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి):మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో పదో తరగతి చదువుతున్న విద్యార్థులకు వంద రోజుల పాటు నిర్వహించే ప్రత్యేక తరగతులు శనివారం నుంచి ప్రారంభమయ్యాయి. ఈ ఏడాది పదో తరగతి విద్యార్థులకు ప్రతిరోజూ ఉదయం 8 నుంచి 9 గంటలకు, సాయంత్రం 4 నుంచి 5 గంటల వరకు స్టడీ అవర్స్ నిర్వహిస్తున్నారు. ప్రతి ఆదివారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా ఎంఈఓ-2 రమేష్‌బాబు మాట్లాడుతూ మండలంలో 12 ఉన్నత పాఠశాలల్లో 739 మంది టెన్త్ విద్యార్థులకు మార్చి 16వ తేదీ వరకు స్టడీ అవర్స్ నిర్వహిస్తామన్నారు. ఆదివారం స్టడీ అవర్స్‌కి వచ్చే విద్యార్థులకు మధ్యాహ్నం 1 గంటకు ఎండీఎం అమలు చేస్తున్నట్టు చెప్పారు.

## భగవద్గీత పఠన పోటీలకు విశేష స్పందన

మునగపాక, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): స్థానిక విశాలాక్షి సమేత కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయ ఆవరణలో ఆదివారం ఏర్పాటు చేసిన భగవద్గీత పఠన పోటీలకు విశేష స్పందన లభించింది. వీహెచ్‌పీ, భారత సాంస్కృతి విభాగం ఆధ్వర్యంలో జరిగిన పోటీల్లో 30 మంది బాలికలు భగవద్గీతలో పలు శ్లోకాలను అవలీలగా పఠనం చేసి అబ్బురపరిచారు. పాల్గొన్న వారందరికి ప్రశంసా పత్రం, పుస్తకాలను అందజేశారు. కార్యక్రమంలో టీటీడీ ధర్మాచార్య బి.నరసింహమూర్తి, మురళీకృష్ణ, వీహెచ్‌పీ మండల అధ్యక్షుడు శరగడం పరదేశినాయుడు, తేలి నూకరాజు, పెంటకోట జగన్నాథరావునాయుడు, పి.భోగేశ్వరరావు పాల్గొన్నారు.


భగవద్గీత పఠనం చేస్తున్న బాలిక

## పలు గ్రామాల్లో ఆత్మీయ సమావేశాలు

మునగపాక, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): మండలంలో పలు కుటుంబీకుల ఆత్మీయ సమావేశాలతో సండే సందడిగా సాగింది. మండలంలో పాటిపల్లి-మంగళవరపుపేటలో బండి నూకాంబికా అమ్మవారి ఆలయం వద్ద భీశెట్టి కుటుంబీకుల ఆడపడుచులు ఆత్మీయ సమారాధన జరిగింది. మునగపాక పరదేశమ్మ ఆలయ వద్ద గౌతమి పఠన మందిరం ప్రతినిధులు వనసమారాధన ఏర్పాటు చేశారు. జడ్పీ హైస్కూల్‌కు చెందిన 1981-82 పదో తరగతి పూర్వ విద్యార్థులు ఆత్మీయ సమావేశం, స్థానిక పల్లపువీధికి చెందిన సూరిశెట్టి కుటుంబీకులు కశింకోట మండలం పడమటమ్మ ఆలయం వద్ద ఆత్మీయ వనసమారాధనలు ఏర్పాటు చేసుకున్నారు. అందరూ ఆట, పాటలతో అలరించారు. విజేతలకు ప్రోత్సాహక బహుమతులను అందజేశారు.

## నాటకరంగ ప్రముఖులకు సత్కారం

మునగపాక, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో పలువురు నాటక రంగ ప్రముఖులను ఆదివారం తులసీ కళావేదికపై ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఏపీ రాష్ట్ర నాటక అకాడమి డైరెక్టర్ పల్లా విలియంకేరి, అన్నమయ్య కళాక్షేత్రం రాష్ట్ర అధ్యక్షుడు సానా నూకరాజునాయుడు, ఎస్వీరంగారావు కళాస్రవంతి వర్కింగ్ ప్రెసిడెంట్ గళ్ళ పద్మారావు, అల్లూరి సీతారామరాజు పాత్రదారి గోపు రాంబాబులను నందీశ్వర నాట్య మండలి సభ్యులు శాలువాతో సత్కరించి, జ్ఞాపికలను అందజేశారు.

## 10న మండల సర్వ సభ్య సమావేశం

కోటవురట్ల, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): మండల సర్వసభ్య సమావేశం ఈనెల 10వ తేదీన ఎంపీపీ సింగంపల్లి అప్పలనాయుడు అధ్యక్షతన నిర్వహిస్తున్నట్టు ఎంపీడీవో చంద్రశేఖర్ తెలిపారు. బుధవారం ఉదయం 10.30 గంటలకు జరిగే సమావేశానికి సభ్యులందరూ హాజరుకావాలన్నారు. మండలస్థాయి అధికారులు సమగ్ర సమాచారంతో హాజరుకావాలని ఆయన కోరారు.

**పాయకరావుపేటలో..**

పాయకరావుపేట, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : ఈనెల 10వ తేదీన మండల పరిషత్ సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్టు ఎంపీడీఓ విజయలక్ష్మి తెలిపారు. ఉదయం 10.30 గంటలకు ఎంపీపీ ఇసరపు పార్వతి అధ్యక్షతన నిర్వహించే సమావేశానికి సభ్యులు హాజరుకావాలని కోరారు. అదేవిధంగా మండల అధికారులు తమ శాఖలకు సంబంధించిన సమాచారంతో హాజరుకావాలన్నారు.

## నేత్ర వైద్య శిబిరంలో 98 మందికి పరీక్షలు

ఎలమంచిలి, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): మునిసిపాలిటీలోని యర్రవరంలో ఆదివారం నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరంలో 98 మంది రోగులకు పరీక్షలు నిర్వహించినట్టు మాజీ వైస్ ఎంపీపీ పిట్టా శ్రీను తెలిపారు. విశాఖ శంకర్ ఫౌండేషన్ డాక్టర్ గీతాంజలి, వైద్య సిబ్బంది రోగులను పరీక్షించినట్టు చెప్పారు. శస్త్ర చికిత్స అవసరం ఉన్న 16 మందిని విశాఖ ఆస్పత్రికి తరలిస్తున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ మేనేజరు అరుణ్ కుమార్, స్థానికులు పిట్టా గోవింద, పిట్టా రమణ, వీసం గంగరాజు, దూలి అప్పల చిట్టి, పిట్టా దాసు, గ్రామస్థులు పాల్గొన్నారు

## కొళాయిల్లో బురద నీరు

... 5వ పేజీ తరువాయి

ట్యాంకులలోకి నీరు సరిగా సరఫరా కావడం లేదు. ఫలితంగా కొళాయిల ద్వారా తాగునీటి సరఫరా అస్తవ్యస్తంగా తయారైంది. ఇటువంటి పరిస్థితుల్లో కొన్ని వార్డులకు ట్యాంకర్ల ద్వారా తాగునీటిని పంపుతుండగా, మిగిలిన చోట్ల స్థానికులు తాగునీటి కోసం బోర్లు లేదా ఆర్‌వో ప్లాంట్లను ఆశ్రయిస్తున్నారు. ఇప్పటికైనా పంచాయతీ అధికారులు ఈ రెండు ట్యాంకుల ద్వారా కలుషిత నీరు సరఫరా కాకుండా చర్యలు చేపట్టడంతో పాటు, ప్రతి రోజూ తాగునీటి సరఫరా సరిగ్గా అయ్యేలా చర్యలు చేపట్టాలని స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు.

## పరాయి పంచన పాట్లు

... 5వ పేజీ తరువాయి

కొన్ని ప్రభుత్వ శాఖల కార్యాలయాలను పట్టణానికి శివారులో, సమీపంలోని మండలాల్లో ఏర్పాటు చేశారు. పట్టు పరిశ్రమ కార్యాలయాన్ని సబ్బవరం మండలం అసకపల్లిలో ఒక చిన్న ప్రైవేటు భవనంలో నడుపుతున్నారు. అన్ని ప్రభుత్వ శాఖల కార్యాలయాలు అద్దె భవనాలు, ఇరుకు గదుల్లో నిర్వహిస్తుండడంతో ఉద్యోగులు, వివిధ పనుల నిమిత్తం వచ్చే ప్రజలు అసౌకర్యానికి గురవుతున్నారు.

**అనకాపల్లికి రాని కేంద్ర ప్రభుత్వ శాఖలు**

అనకాపల్లి కేంద్రంగా కొత్త జిల్లా ఏర్పడి మూడున్నరేళ్లు దాటినప్పటికీ కేంద్ర ప్రభుత్వ శాఖలు ఇంకా విశాఖ నుంచి అనకాపల్లికి తరలించలేదు. పరవాడ, అచ్యుతాపురం, రాంబిల్లి మండలాల్లో ఔషధ తయారీ పరిశ్రమలు ఎక్కువగా ఉన్నాయి. వీటికి సంబంధించి కాలుష్య నియంత్రణ మండలి కార్యాలయాన్ని అనకాపల్లిలో ఏర్పాటు చేయలేదు. ఎన్‌హెచ్ఏఐ, కేంద్ర వాణిజ్య పన్నులు, ఇతర కేంద్ర ప్రభుత్వ శాఖల కార్యాలయాలన్నీ విశాఖలోనే కొనసాగుతున్నాయి. కూటమి అధికారంలోకి వచ్చిన తరువాత అనకాపల్లిలో ఎన్ని కార్యాలయాలు అద్దె భవనాల్లో ఉన్నాయి? ఏయే శాఖలకు భవనాలు నిర్మించాలి అన్న వివరాలను జిల్లా అధికారులు ఇప్పటికే ప్రభుత్వానికి పంపారు.

## గంజాయి కట్టడిపై డేగ కన్ను

... 5వ పేజీ తరువాయి

నిఘా పెట్టారు. గంజాయి నిల్వ చేసే శిబిరాలపై దాడులు జరుపుతున్నారు. ఇదే సమయంలో అన్ని పోలీసు స్టేషన్‌ల పరిధిలో సీఐలు, ఎస్ఐలు ప్రత్యేక బృందాలుగా ఏర్పడి గంజాయి, మాదకద్రవ్యాలు వంటివాటిని వినియోగించే శివారు ప్రదేశాలు, వినియోగంలో లేని భవనాలు, ఖాళీ స్థలాల్లో డ్రోన్ల సాయంతో పరిశీలించి, మెరుపు దాడులు నిర్వహిస్తున్నారు. అనుమానితులను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు.

**ప్రజల సహకారంతో..**

**తుహిన్ సిన్హా, ఎస్పీ**



జిల్లాలో గంజాయి రవాణా, మాదకద్రవ్యాల వినియోగాన్ని సమూలంగా అరికట్టేందుకు ప్రజల సహకారం తీసుకుంటున్నాం. గ్రామాల్లో సైతం రాత్రి బీట్‌లు ఏర్పాటు చేసి ప్రత్యేక నిఘా బృందాలను నియమించాం. గంజాయి రవాణా, మాదక ద్రవ్యాల వినియోగంపై సమాచారం ఇచ్చిన వారి పేర్లను గోప్యంగా ఉంచుతామన్నారు.

## ఇరువర్గాల ఫిర్యాదులపై కేసుల నమోదు

మునగపాక, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి):మండలంలో నాగులాపల్లిలో ఇద్దరు వ్యక్తుల మధ్య వివాదంపై కేసులు నమోదు చేసినట్టు ఎస్ఐ పి.ప్రసాదరావు తెలిపారు. నాగులాపల్లి గ్రామానికి చెందిన డొక్కా శివ అనే వ్యక్తి అదే గ్రామానికి చెందిన ముప్పిడి రుక్మాజీని అవమానించారని, ఎందుకు అవమానించావని రుక్మాజీ, అతని స్నేహితులు శివ ఇంటికి వెళ్లి నిలదీశారు. ఈ సందర్భంగా ఇరువురు మధ్య గొడవ జరగడంతో ఒకరిపై మరొకరు ఆదివారం పోలీసులకు ఫిర్యాదులు చేసుకున్నారు. ఇరువర్గాలపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్టు ఎస్ఐ ప్రసాదరావు తెలిపారు.

## తంగేడులో సోషల్ ఆడిట్ గ్రామసభ

కోటవురట్ల, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తంగేడు పంచాయతీలో ఆదివారం ఉపాధి హామీ సోషల్ ఆడిట్ గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధి హామీ పథకం ఏపీడీ నాగరాజు మాట్లాడుతూ 2024 ఏప్రిల్ నుంచి 2025 మార్చి వరకు మండలంలో రూ.18కోట్ల విలువైన అభివృద్ధి పనులు చేసినట్టు తెలిపారు. ఈ పనులకు సంబంధించి గ్రామాల్లో సామాజిక తనిఖీ బృందాలు సోషల్ ఆడిట్ వివరాలను గ్రామసభల్లో వెల్లడించారు. తంగేడు గ్రామంలో ఏడాదిలో 58 అభివృద్ధి పనులకు రూ.65.32 లక్షలు ఖర్చు చేసినట్టు తెలిపారు. మండలంలో ఇప్పటివరకు గ్రామసభలు బీకేపల్లి నీలిగుంట పాములవాక, తంగేడు రామన్నపాలెంల్లో నిర్వహి-ంచినట్టు ఉపాధి హామీ ఎస్ఆర్‌పీ రామచంద్ర తెలిపారు.

## 'చిట్టి సేవలు అభినందనీయం'


వృద్ధురాలికి దుప్పటి అందజేస్తున్న బంగారు చిట్టి, లోవరాజు

ఎస్.రాయవరం, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): మునలమ్మ చారిటబుల్ ట్రస్టు ద్వారా చైర్మన్ బంగారు చిట్టి చేస్తున్న సేవలు అభినందనీయమని తెలుగు యువత మండల అధ్యక్షుడు కోడ లోవరాజు కొనియాడారు. మండలంలోని రేవుపోలవరం, కొత్త రేవుపోలవరం గ్రామాల్లో ఆదివారం 150 మంది వృద్ధులకు దుప్పట్లను లోవరాజు, బంగారు చిట్టి పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో గనగళ్ల మధు, దూడ నూకరాజు, గరికిన రమణ, గోవిందు, జి శ్రీను, ముసిలి, అనీల్, చోడిపల్లి లోవరాజు, జగదీశ్ పాల్గొన్నారు.

## గౌరీపరమేశ్వరుల ఉత్సవం ప్రశాంతంగా జరగాలి

మునగపాక, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గణపర్తి గౌరీ పరమేశ్వరులు ఉత్సవం ఎటువంటి వివాదాలకు తావులేకుండా ప్రశాంతంగా నిర్వహించాలని సీఐ ధనుంజయరావు సూచించారు. స్థానిక పోలీసు స్టేషన్‌లో ఆదివారం గణపర్తి గౌరీపరమేశ్వరులు ఉత్సవ కమిటీ సభ్యులతో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా శాంతిభద్రతలకు విఘాతం లేకుండా, అశ్లీలనృత్యాలకు తావులేకుండా ఉత్సవాన్ని నిర్వహించాలన్నారు. ఎస్ఐ పి.ప్రసాదరావు మాట్లాడుతూ నిబంధనలు అతిక్రమిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న కమ్మ సంక్షేమ కార్పొరేషన్ చైర్మన్ బ్రహ్మం చౌదరి, నాయకులు

## రాజకీయాలకు అతీతంగా ఐక్యతతో ముందుకు..

### రాష్ట్ర కమ్మ సంక్షేమ కార్పొరేషన్ చైర్మన్ నాదెండ్ల బ్రహ్మం చౌదరి

అనకాపల్లి, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): రాజకీయాలకు అతీతంగా ఐక్యతతో ముందుకు సాగుదామని రాష్ట్ర కమ్మ సంక్షేమ కార్పొరేషన్ చైర్మన్ నాదెండ్ల బ్రహ్మం చౌదరి పిలుపునిచ్చారు. కశింకోట మండలంలోని బయ్యవరం ఎస్ఆర్ గార్డెన్స్‌లో ఆదివారం జిల్లా కమ్మ వెల్ఫేర్ అసోసియేషన్ ఆత్మీయ సమ్మేళనం జరిగింది. ముందుగా కమ్మ వేదికపై ఏర్పాటు చేసిన దివంగత నేత ఎన్టీ రామారావు విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన ప్రసంగించారు. కమ్మ కులస్థులు అంటేనే సేవకు, దాతృత్వానికి మారు పేరన్నారు. భవిష్యత్తులో మరిన్ని సామాజిక సేవా కార్యక్రమాలు చేపట్టడంలో ముందుండాలన్నారు. అందరూ ఐక్యతతో కలిసి పనిచేస్తే సాధ్యం కానిదేమీ ఉండదన్నారు. అనకాపల్లి జిల్లా కమ్మ సంక్షేమ సంఘ ప్రతినిధుల సేవలను ఈ సందర్భంగా ఆయన కొనియాడారు. ఈ కార్యక్రమానికి అధిక సంఖ్యలో కమ్మ కుటుంబ సభ్యులు హాజరై ఆటపాటలతో సరదాగా గడిపారు. వివిధ ఆటలపోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమానికి కమ్మ వెల్ఫేర్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు కాకర్ల రమేశ్‌బాబు, కార్యదర్శి కొల్లి శ్రీనివాస్ సారథ్యం వహించారు. సమావేశానికి అర్బన్ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ వెంగమాంబ శ్రీనివాసబాబు, సంఘ ప్రతినిధులు పరుచూరి భాస్కరరావు, కమ్మ సేవా సమితి మండలి మురళి, కమ్మ కార్పొరేషన్ డైరెక్టర్ సజ్జ అజయ్ తదితరులు పాల్గొన్నారు.

## ముగిసిన టాంగ్-థా రాష్ట్ర స్థాయి ఎంపిక పోటీలు

» అండర్-14, 17, 19 విభాగాల్లో 36 మంది ఎంపిక

పరవాడ, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఇండోర్ స్టేడియంలో టాంగ్-థా అండర్-14, 17, 19 విభాగాల్లో బాలబాలికలకు రెండు రోజులుగా జరుగుతున్న రాష్ట్ర స్థాయి ఎంపిక పోటీలు ఆదివారంతో ముగిశాయి. ఏడు జిల్లాల నుంచి 250 మంది విద్యార్థులు పోటీల్లో పాల్గొన్నారు. ఆద్యంతం పోటీలు హోరాహోరీగా సాగాయి. అండర్-14, 17, 19 విభాగాల్లో జాతీయ స్థాయి పోటీలకు 36 మంది విద్యార్థులు ఎంపికయ్యారని ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి కేఎం.నాయుడు తెలిపారు. వచ్చే ఏడాది జనవరి 17 నుంచి 22వ తేదీ వరకు ఢిల్లీలో జరిగే జాతీయ స్థాయి టాంగ్-థా పోటీల్లో 36 మంది విద్యార్థులు పాల్గొంటారని ఆయన చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎస్‌జీఎఫ్ జిల్లా మాజీ కార్యదర్శి ఎంవీ.నాగేశ్వరరావు, సహాయ కార్యదర్శి అచ్చెమ్మ, ఎస్‌జీఎఫ్ రాష్ట్ర పరిశీలకులు శ్రీహరిరాజు, ఏవీడీ ప్రసాద్, నాయుడు, ప్రతినిధులు జీ.రాజు, నూకరాజు, ఎస్.శ్రీనివాస్, పి.లక్ష్మి పాల్గొన్నారు.

## విద్యాభివృద్ధికి ఎన్టీపీసీ కృషి: ఈడీ సమీర్‌శర్మ





ఉపకార వేతనాలు అందిస్తున్న ఈడీ సమీర్‌శర్మ

పరవాడ, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): నిర్వాసిత గ్రామాల్లో విద్యాభివృద్ధికి సింహాద్రి ఎన్టీపీసీ కృషి చేస్తున్నదని సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ (ఈడీ) సమీర్ శర్మ చెప్పారు. సింహాద్రి సామాజిక బాధ్యతలో భాగంగా పరవాడ, పెదగంట్యాడ రూరల్ మండలాల పరిధిలోని 15 ప్రభుత్వ పాఠశాలలు, మూడు జూనియర్ కళాశాలల్లో పది, ఇంటర్ పరీక్షల్లో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు ఆదివారం ఉపకార వేతనాలు అందించారు. స్థానిక అడ్మిన్ భవనం ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ విద్యార్థుల అభ్యున్నతికి తమ వంతు కృషి చేస్తున్నామన్నారు. అలాగే పాఠశాలల్లో పూర్తిస్థాయిలో మౌలిక వసతులు కల్పించేందుకు నిధులు మంజూరు చేస్తున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో సంస్థ జీఎంలు, సీఎస్ఆర్ ప్రతినిధులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## ఎట్టకేలకు దేమునిగుమ్మం సీసీ రోడ్డు పూర్తి



పూర్తయిన నూకాంబిక ఆలయానికి వెళ్లే సీసీ రోడ్డు

అనకాపల్లి టౌన్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): దేమునిగుమ్మం నూకాంబిక అమ్మవారి ఆలయ ముఖద్వారం నుంచి ఆలయానికి వెళ్లే సీసీ రోడ్డు నిర్మాణం ఎట్టకేలకు పూర్తయింది. రాజీవ్‌గాంధీ ఇండోర్ స్టేడియం నుంచి పూల్‌బాగ్‌కు వెళ్లే జంక్షన్ వరకు సీసీ రోడ్డు నిర్మించాల్సి ఉండగా, సుమారు 50 అడుగుల వరకు అసంపూర్తిగా నిలిపివేయడంతో రాకపోకలు సాగించే ప్రజలు, భక్తులు తీవ్ర ఇబ్బందులు పడేవారు. దీనిపై గత నెల 24న 'ఆంధ్రజ్యోతి'లో ప్రత్యేక కథనం ప్రచురితం కావడంతో ఎట్టకేలకు జీవీఎంసీ అధికారులు స్పందించి సీసీ రోడ్డు నిర్మాణ పనులు పూర్తి చేశారు. దీంతో ఈ మార్గంలో రాకపోకలు సాగించే ప్రయాణికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

## బొజ్జన్న కొండపై పిక్నిక్ సందడి

తుమ్మపాల, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ పర్యాటక కేంద్రం బొజ్జన్న కొండ వద్ద ఆదివారం పిక్నిక్ సందడి నెలకొంది. చుట్టు పక్కల ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో పర్యాటక ప్రేమికులు బొజ్జన్నకొండకు చేరుకున్నారు. కొండపై గల శిలాసంపదను ఆసక్తిగా తిలకించి సెల్‌ఫోన్‌ల్లో బంధించారు. కొండ దిగువున పచ్చని పచ్చిక మైదానంలో ఆటపాటలతో ఆనందంగా గడిపారు. మధ్యాహ్నం సామూహిక విందు భోజనాలను చేశారు.

## అసభ్యకర నృత్యాలు చేయించిన వారిపై కేసు

కె.కోటపాడు, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): గొండుపాలెం సమీపాన ఓ రిస్టార్స్‌లో ఈ నెల ఒకటో తేదీ రాత్రి అసభ్యకర నృత్యాలు చేయించిన వ్యక్తులపై కేసు నమోదు చేసినట్టు సీఐ పి.పైడపునాయుడు తెలిపారు. బుచ్చెయ్యపేటకు చెందిన ఆర్గనైజర్, చీడికాడ మండలం బైలపూడికు చెందిన ఏడుగురు పురుషులు, ఇద్దరు మహిళలను అదుపులోకి తీసుకున్నామన్నారు. మహిళలను పిలిపించి బలవంతంగా అసభ్యకర నృత్యాలు చేయించినట్టు విచారణలో తేలిందన్నారు. నిందితులను చోడవరం కోర్టుకు తరలించామని సీఐ తెలిపారు.



# నూకాంబిక ఆలయానికి పోటెత్తిన భక్తులు



అమ్మవారి దర్శనానికి క్యూలో బారులు తీరిన భక్తులు... (ఇన్‌సెట్‌లో) పూల అలంకరణలో నూకాంబిక అమ్మవారు

అనకాపల్లి టౌన్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): ఉత్తరాంధ్రలోనే ప్రఖ్యాతిగాంచిన అనకాపల్లి నూకాంబిక అమ్మవారి ఆలయం ఆదివారం భక్తులతో పోటెత్తింది. బాలాలయంలో తెల్లవారుజామున అర్చకులు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి నైవేద్యం పెట్టారు. తరువాత భక్తులకు దర్శనం కల్పించారు. విశాఖ ఉమ్మడి జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. ఆదివారం కావడంతో ఇటీవల జరిగిన శుభకార్యాల ఇళ్ల యజమానులు అమ్మవారి మొక్కుబడుల్లో భాగంగా పండుగ చేసుకున్నారు. తమ ఇళ్లల్లో నుంచి అమ్మవారి ఘటాలను నెత్తిన పెట్టుకొని ఊరేగింపుగా ఆలయానికి వచ్చి, అమ్మవారికి ఘటాలను సమర్పించారు. అలాగే 1975 పదో తరగతి బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థులు అమెరికా, కర్ణాటక, తెలంగాణ రాష్ట్రాల నుంచి ప్రత్యేకంగా ఆలయానికి వచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. వీరిని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి బుద్ద నాగ జగదీశ్వరరావు సత్కరించి అమ్మవారి జ్ఞాపికలను బహూకరించారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం తలెత్తకుండా ఆలయ ఈవో వై.శ్రీధర్, సిబ్బంది, ఆలయ పాలకవర్గ చైర్మన్ పీలా నాగశ్రీను, సభ్యులు తగిన చర్యలు చేపట్టారు.

# యాదవులు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలి

### యాదవ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు సాయినాథరావు



నియోజకవర్గ యాదవ సంఘం నూతన కార్యవర్గ ప్రతినిధులు

తుమ్మపాల, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): యాదవులు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలని యాదవ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు భర్నికాన సాయినాథరావు సూచించారు. బొజ్జన్నకొండ వద్ద ఆదివారం జరిగిన యాదవ సంక్షేమ సంఘం విస్తృతస్థాయి సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. ప్రభుత్వం యాదవులకు స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రాధాన్యత కల్పించాలన్నారు. అలాగే పేదలైన యాదవులకు ప్రభుత్వం అండగా ఉండాలని, సమస్యలు పరిష్కరించాలని కోరారు. అనంతరం అనకాపల్లి నియోజకవర్గ యాదవ సంక్షేమ సంఘం ఎన్నికలను నిర్వహించారు. నియోజకవర్గ అధ్యక్షుడిగా పంచదార్ల సూరిబాబు, ప్రధాన కార్యదర్శిగా ఒమ్మి రాముయాదవ్ ఎన్నికయ్యారు. అనకాపల్లి మండల అధ్యక్షుడిగా పంచదార్ల కన్నారావు, ప్రధాన కార్యదర్శిగా కె.ముత్యాలనాయుడు, కశింకోట మండల అధ్యక్షుడిగా కరక రాజు, ప్రధాన కార్యదర్శిగా చొప్పా అప్పలనాయుడు ఎన్నికయ్యారు. అలాగే అనకాపల్లి పట్టణ అధ్యక్షుడిగా కోరుకొండ కన్న, ప్రధాన కార్యదర్శిగా కోన ఉమాలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా నాయకులు కరక సోమునాయుడు, భర్నికాన నరసింహమూర్తి, బంధం వెంకటరమణ, వియ్యపు సింహాచలం, మొల్లి నాగు, గోకివాడ శ్రీరాములు, కుండల రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

### నియోజకవర్గ కన్వీనర్‌గా బోడి వెంకటరావు

అనకాపల్లి టౌన్: అనకాపల్లి నియోజకవర్గ యాదవ సంక్షేమ సంఘం కన్వీనర్‌గా బోడి వెంకటరావు నియమితులయ్యారు. గొల్లవీధి రామాలయంలో సంఘ మాజీ రాష్ట్ర కార్యదర్శి బొట్టా చిన్నియాదవ్ అధ్యక్షతన ఆదివారం జరిగిన సమావేశంలో కన్వీనర్‌గా వెంకటరావును నియమించారు. వెంకటరావును సంఘ సభ్యులు సత్కరించారు. కార్యక్రమంలో సంఘ ప్రతినిధులు భరిణికాన శ్రీనివాస్, బొట్టా ఆదినారాయణ, ఒమ్మి సన్యాసిరావు, బొబ్బిలి గోవిందరావు తదితరులు పాల్గొన్నారు.

## దేశ రక్షణలో యువతే కీలకం

సబ్బవరం, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): దేశ రక్షణలో యువతే కీలకమని తహశీల్దార్ బి.చిన్నికృష్ణ అన్నారు. ఇక్కడ రేంజర్స్ డిఫెన్స్ అకాడమీలో ఒకే ఏడాదిలో ఆర్మీకి ఎంపికైన పది మంది విద్యార్థులకు ఆదివారం సత్కార కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులను తహశీల్దార్ అభినందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఆర్మీ, నేవీ, ఎయిర్‌ఫోర్స్ వంటి రక్షణ రంగాలపై యువత దృష్టిసారించాలని కోరారు. రక్షణ రంగంలో గౌరవం లభించడంతో పాటు ఆకర్షణీయమైన ఉపాధి అవకాశాలు ఉంటాయన్నారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ పోతల సత్యనారాయణ, ప్రిన్సిపాల్ సూర్యప్రకాశ్, టీడీపీ నాయకుడు పోతల కనకరాజు తదితరులు పాల్గొన్నారు.

## మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

అనకాపల్లి టౌన్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): గంజాయి, మత్తు పదార్థాలకు ప్రజలు దూరంగా ఉండాలని జన విజ్ఞాన వేదిక రాష్ట్ర ఉపాధ్యక్షుడు త్రిమూర్తులు కోరారు. స్థానిక పార్కు సెంటరులో 'ఆరోగ్యమే మహాభాగ్యం' సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సమాజంలో గంజాయి వంటి మత్తు పదార్థాలు విచ్చలవిడిగా పెరిగి ప్రజల జీవితాలను, విద్యార్థుల భవిష్యత్తును నాశనం చేస్తున్నాయన్నారు. గొర్రెలు, మేకల పెంపకందారుల సంఘం జిల్లా అధ్యక్షుడు గంటా శ్రీరామ్ మాట్లాడుతూ సమాజంలో ఇలాంటి విచ్చలవిడితనం పెరగడం వల్ల నైతిక విలువలు తగ్గుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో భోగలింగేశ్వరస్వామి ఆలయ చైర్మన్ కాండ్రేగుల సత్యనారాయణ, యల్లయ్య సాగునీటి సంఘం అధ్యక్షుడు బుద్ద మహాలక్ష్మినాయుడు పాల్గొన్నారు.

## కోడి పందేల శిబిరంపై దాడి

» ఎనిమిది మంది అరెస్టు

కశింకోట, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నర్సింగబిల్లి గ్రామ శివారున కోడి పందేల శిబిరంపై ఆదివారం పోలీసులు దాడి చేశారు. సీఐ అల్లు స్వామినాయుడుకు వచ్చిన సమాచారం మేరకు ఎస్ఐ మనోజ్‌కుమార్ సిబ్బందితో వెళ్లి దాడి చేయగా ఎనిమిది మంది పట్టుబడ్డారు. వీరి నుంచి రెండు కోడి పుంజులు, రూ.650 నగదు స్వాధీనం చేసుకున్నామని సీఐ తెలిపారు. మండలంలోని కోడిపందాలు, అక్రమ కార్యకలాపాలు, శాంతిభద్రతలకు హాని కలిగించే చర్యలు కొనసాగితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

## భార్యను వేధించిన వ్యక్తిపై కేసు నమోదు

నర్సీపట్నం, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): భార్యను వేధించిన కేసులో ఓ వ్యక్తిపై గృహ హింస కేసు నమోదు చేసినట్టు సీఐ గఫూర్ తెలిపారు. బలిఘట్టం గ్రామానికి చెందిన అల్లంపల్లి లక్ష్మిని, ఆమె భర్త అల్లంపల్లి ఈశ్వరరావు మద్యం మత్తులో తరచూ వేధిస్తున్నాడని చెప్పారు. మానసికంగా, శారీరంగా చిత్ర హింసలు పెడుతున్నట్టు ఈ నెల 5న ఇచ్చిన ఫిర్యాదులో బాధితురాలు పేర్కొన్నట్టు సీఐ తెలిపారు. భార్యాభర్తలకు కౌన్సెలింగ్ ఇచ్చినా ఫలితం లేకపోవడంతో ఈశ్వరరావుపై గృహ హింస కేసు నమోదు చేశామన్నారు. అతనిపై గతంలో 9 కేసులు ఉన్నాయని, టౌన్ స్టేషన్‌లో రౌడీ షీటు ఉందని సీఐ తెలిపారు.

## ఆర్టీసీ కాంప్లెక్స్ ఆవరణలో వాహన పార్కింగ్‌కు చెక్





కాంప్లెక్స్ ఆవరణలో నో పార్కింగ్ బోర్డు, సెక్యూరిటీ గార్డు

అనకాపల్లి టౌన్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్ ఆవరణలోకి ద్విచక్ర వాహనాలు పార్కింగ్ చేయకుండా అధికారులు చర్యలు చేపట్టారు. కాంప్లెక్స్‌లో పార్కింగ్ స్థలం ఉన్నప్పటికీ కొంతమంది కాంప్లెక్స్ ముఖ ద్వారం వద్ద కుడి వైపున ద్విచక్ర వాహనాలను నిలిపి వేస్తున్నారు. దీంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. దీనిపై 'ఆంధ్రజ్యోతి'లో ప్రత్యేక కథనం ప్రచురితం కావడంతో ఆర్టీసీ అధికారులు స్పందించారు. ఈ మేరకు నో పార్కింగ్ బోర్డు పెట్టడంతో పాటు వాహనాలతో లోపలకి రాకుండా నివారించేందుకు ఓ వ్యక్తిని ఏర్పాటు చేశారు. కాంప్లెక్స్ మార్గంలో వాహనాలు లేకపోవడంతో ప్రయాణికులకు ఇబ్బందులు తప్పాయి.

## తిరుమలకు కాలినడకన భక్తులు



తిరుమలకు కాలినడకన బయలుదేరిన భక్తులు

అనకాపల్లి టౌన్/మునగపాక, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): పట్టణానికి చెందిన శ్రీవారి భక్తులు గోవిందమాల ధరించి ఆదివారం కాలినడకన తిరుమలకు బయలుదేరారు. ఈ పాదయాత్రను టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి దాడి రత్నాకర్ గవరపాలెం గంగిరేవిచెట్టు వద్ద ప్రారంభించారు. రోజుకు 30 కిలోమీటర్లు పాదయాత్ర చేస్తామని, తిరుమల చేరేందుకు 28 రోజుల సమయం పడుతుందని భక్తులు తెలిపారు. గోవిందనామ స్మరణతో యాత్ర ససాగించారు. దాడి నాయుడు, వైవీ.రమణాజీ, చింతల హేమంత్, ఒ.నవీన్, సీతానగరానికి చెందిన దాడి కార్తీక్, విశాఖకు చెందిన వేగి కోటేశ్వరరావు, వేగి సూర్యారావు, చింతల అగ్రహారానికి చెందిన జగదీశ్, మునగపాక మండలం వాడ్రాపల్లికి చెందిన పిల్లి సూర్యనారాయణ, బుద్ద సత్యనారాయణ, మళ్ల త్రినాథరావు తిరుమలకు కాలినడకన బయలుదేరారు. పాదయాత్ర ప్రారంభోత్సవంలో జబర్దస్త్ సత్తిపండు, రాష్ట్ర అర్చక ఎగ్జామినర్ రేజేటి రామాచార్యులు, కన్నబాబు, చక్రవర్తి, మారుతి పాల్గొన్నారు.

## నేడు ప్రజాదర్బార్

అనకాపల్లి టౌన్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని గాంధీనగరం ఎస్ఆర్ శంకరన్ సమావేశ మందిరంలో సోమవారం ప్రజాదర్బార్ జరుగుతుందని జీవీఎంసీ జోనల్ కమిషనర్ కె.చక్రవర్తి తెలిపారు. ఉదయం పది నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ స్వయంగా పాల్గొని ప్రజల నుంచి వినతిపత్రాలు స్వీకరిస్తారన్నారు. అలాగే వివిధ శాఖల అధికారులు ప్రజాదర్బార్‌కు హాజరవుతారని, ఐదు వార్డుల ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

## ఉత్సాహంగా ఫ్రెషర్స్ డే

లంకెలపాలెం, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 85వ వార్డు పరిధిలోని మంత్రిపాలెంలో గల నోబుల్ ఇనిస్యూట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ (నిస్ట్)లో ఆదివారం ఫ్రెషర్స్ డే ఉత్సాహంగా జరిగింది. ఎంబీఏ, ఎంసీఏ, బీజీఎం, బీఎస్సీ విద్యార్థులు జూనియర్లకు ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా విద్యార్థులు పలు సాంస్కృతిక కార్యక్రమాలతో సందడి చేశారు. విద్యార్థులు చక్కగా చదువుకొని ప్రయోజకులుగా ఎదగాలని కళాశాల చైర్మన్ బి.ఆనందరావు ఆకాంక్షించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ హనీవుద్దీన్, ఐటెక్ ఐటీఐ ప్రిన్సిపాల్ ఎ.దుర్గినాయుడు పాల్గొన్నారు.

## నేడు మండల సమావేశం

సబ్బవరం, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం సర్వసభ్య సమావేశం జరుగుతుందని ఎంపీడీవో పి.పద్మజ తెలిపారు. ఉదయం 10.30 గంటలకు ప్రారంభమయ్యే ఈ సమావేశానికి ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు, అన్ని శాఖల అధికారులు హాజరుకావాలని కోరారు.

## వైసీపీ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడిగా సురేశ్‌రాజ్



సురేశ్‌రాజ్

సబ్బవరం, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆరిపాక శివారు లగిశెట్టిపాలెం గ్రామానికి చెందిన వైసీపీ సీనియర్ నేత పాలిశెట్టి సురేశ్‌రాజ్ పార్టీ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడిగా నియమితులయ్యారు. ఈ మేరకు పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యాలయం నుంచి ఉత్తర్వులు అందాయని సురేశ్‌రాజ్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తనకు పదవి రావడానికి కారకులైన అందరికీ కృతజ్ఞతలు తెలిపారు. తనపై నమ్మకంతో అప్పగించిన బాధ్యతలను చిత్తశుద్ధితో నిర్వర్తిస్తానని చెప్పారు.

## వైసీపీ కోటి సంతకాల సేకరణ

సబ్బవరం, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా వైసీపీ రాష్ట్ర కార్యదర్శి గండి రవికుమార్ ఆధ్వర్యంలో ఆదివారం కోటి సంతకాలను సేకరించారు. మండలంలోని మొగలిపురం గ్రామంలో ఆదివారం ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా వైసీపీ పెందుర్తి ఇన్‌చార్జి అన్నంరెడ్డి అదీప్‌రాజ్ మాట్లాడుతూ మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణ వల్ల విద్యా, వైద్యంలో ప్రజలకు నష్టం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో యువజన విభాగం మండల ఉపాధ్యక్షుడు యడ్ల నాయుడు, నాయకులు గురి సతీశ్, పైల దేముడు, రాము నాయుడు, ఎస్.వాసు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## మైనర్లకు వాహనాలిస్తే కఠిన చర్యలు: ఎస్ఐ



కాశీపట్నం వద్ద వాహనాలను తనిఖీ చేస్తున్న ఎస్ఐ శ్రీనివాసరావు, పోలీస్ సిబ్బంది

అనంతగిరి, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): మైనర్లు వాహనాలిస్తే కేసులు నమోదు చేస్తామని స్థానిక ఎస్ఐ డి.శ్రీనివాసరావు హెచ్చరించారు. మండలంలోని కాశీపట్నం వద్ద ఆదివారం వాహన తనిఖీలు నిర్వహించారు. వాహన రికార్డులు, లైసెన్స్, హెల్మెట్లు లేకుండా వాహనాలు నడుపుతున్న పలువురికి అపరాధ రుసుం విధించారు. రోడ్డు భద్రతపై అవగాహన కల్పించారు. పర్యాటక సీజన్ కావడంతో పర్యాటకులు, ప్రైవేటు వాహనదారులు తగు జాగ్రత్తలు పాటిస్తూ ఘాట్‌రోడ్డులోని వాహనాలు నడపాలని సూచించారు.కానిస్టేబుల్ గిరి, సిబ్బంది పాల్గొన్నారు.

## బోర్‌వెల్స్ మరమ్మతుకు ప్రత్యేక కార్యాచరణ



15వ ఆర్థిక సంఘం నిధులతో కొనుగోలు చేసిన బోర్‌వెల్ సామగ్రిని పరిశీలిస్తున్న ఏఈఈ స్వర్ణలత

చింతపల్లి, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): గిరిజన గ్రామాల్లో మరమ్మతులకు గురైన బోర్‌వెల్స్ మరమ్మతుకు ప్రత్యేక కార్యాచరణ ప్రారంభించినట్టు స్థానిక ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈఈ గడుతూరి స్వర్ణలత తెలిపారు. ఆదివారం బోరు మరమ్మతులకు అవసరమైన సామగ్రిని ఎంపీడీవో కార్యాలయానికి తరలించారు. ఈ సందర్భంగా ఏఈఈ మాట్లాడుతూ బోర్‌వెల్స్ మరమ్మతులకు సామగ్రిని రూ.ఐదు లక్షల మండల పరిషత్ 15వ ఆర్థిక సంఘం నిధులతో కొనుగోలు చేశామన్నారు. మెకానిక్‌లతో ప్రతి గ్రామంలోని బోర్ వెల్స్‌ని పరిశీలించి అవసరమైన మరమ్మతులు చేస్తామన్నారు. నెలాఖరు నాటికి ప్రతి చేతి పంపు వినియోగంలోకి వస్తుందన్నారు. వేసవి నాటికి నీటి సమస్యలేకుండగా ముందస్తు చర్యలు తీసుకుంటున్నామన్నారు.

## చట్టవ్యతిరేక కార్యకలాపాలకు దూరంగా ఉండాలి: ఎస్ఐ



ధారకొండ సంతలో గిరిజన యువతకు అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ యాసిన్

సీలేరు, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి: యువత చట్టవ్యతిరేక కార్యకలాపాలకు దూరంగా ఉండాలని స్థానిక ఎస్ఐ యాసీన్ కోరారు. ధారకొండ సంతకు వచ్చిన వివిధ గ్రామాల గిరిజన యువతకు ఈ మేరకు అవగాహన కల్పించారు. మత్తు పదార్థాల వ్యసనాలతో జీవితాలు నాశనమవుతాయని హెచ్చరించారు. అలాగే, ద్విచక్ర వాహనాలను, ఆటోలను ఇతర వాహనాలను నడిపే ప్రతీ ఒక్కరూ తప్పనిసరిగా లైసెన్సులను, వాహనాల రికార్డులను కలిగి ఉండాలని సూచించారు. వాహనాలను మితిమీరిన వేగంతో నడపరాదని, మద్యం సేవించి వాహనాలను నడిపితే కేసులు తప్పవని హెచ్చరించారు. సైబర్ నేరగాళ్ల చేతిలో ఎవరైనా మోసపోతే వెంటనే తమకు సమాచారం అందించాలని కోరారు. గిరిజన యువత అసాంఘిక శక్తులకు దూరంగా ఉండాలని అవగాహన కల్పించారు.

## ఐదు ధాన్యం గడ్డి కుప్పలు దగ్ధం



మంటలను ఆర్పుతున్న గ్రామస్థులు

అరకులోయ, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మాడగడ గ్రామ పంచాయతీ పరిధి కురడగుడ గ్రామంలో ఆదివారం సాయంత్రం ప్రమాదవశాత్తు జరిగిన ఘటనలో ఐదు ధాన్యం కుప్పలు దగ్ధమయ్యాయి. కొర్రా లచ్చన్నవి రెండు , కొర్రా చంద్రన్నవి రెండు, వంతల సీతన్నది ఒక కుప్ప కాలిపోయినట్టు సర్పంచ్ పాడిబారికి జ్యోతి, పెసా కమిటీ కార్యదర్శి బాలు తెలిపారు.నష్టపోయిన రైతులకు ప్రభుత్వం నష్టపరిహారం చెల్లించి ఆదుకోవాలన్నారు. ఆరుగాలం కష్టపడి పండించిన పంట అగ్నికి ఆహుతి కావడంతో రైతులు లబోదిబోమంటున్నారు.

## వాహన తనిఖీలు

ముంచంగిపుట్టు, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ఎస్ఐ జె.రామకృష్ణ ఆధ్వర్యంలోని ఆదివారం వాహన తనిఖీలు నిర్వహించారు. ఆంధ్ర, ఒడిశా సరిహద్దు ప్రాంతాలు కావడంతో పోలీసులు అప్రమత్తంగా ఉంటున్నారు. ప్రతి వాహనాన్ని క్షుణంగా పరిశీలిస్తున్నారు. అనుమానితులను ప్రశ్నించి విడిచిపెట్టారు.

# రోడ్డు వేశారు.. బస్సు సర్వీసు మరిచారు

- లక్ష్మీపురానికి రూ. 10 కోట్లతో రహదారి నిర్మాణం
- ఆర్టీసీ బస్సు కేటాయింపులో నిర్లక్ష్యం
- నాలుగు పంచాయతీల గిరిజనులకు అవస్థలు

ముంచంగిపుట్టు, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని లబ్బూరు జంక్షన్ నుంచి లక్ష్మీపురం వరకు సుమారు రూ. 7కోట్లు వెచ్చించి పదేళ్ల కిందట నూతన రహదారిని నిర్మించారు. అయితే, నేటికీ ఆర్టీసీ బస్సు సర్వీసును అధికారులు నడపలేదు. దీంతో కోట్లాది రూపాయలతో నిర్మించిన పక్కా రహదారి ఉన్నా ఆశించిన స్థాయిలో ఉపయోగపడటంలేదని ఆ ప్రాంతీయులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పక్కా రహదారి సౌకర్యం ఉన్నా అటుగా ఆర్టీసీ బస్సు సర్వీసులను నడిపేందుకు కనీస దృష్టిసారించకపోవడంతో పలు విమర్శలకు తావిస్తోంది. రహదారి పనులు పూర్తి అయిన తొలినాళ్లలో అటుగా పాడేరు ఆర్టీసీ డిపోనకు చెందిన బస్సును ట్రైల్‌రన్‌గా నడిపారు. అయితే ఆ మార్గంలో పలు చోట్ల హెయిర్ పిన్ బెండ్లు తలపించే విధంగా మలుపులు ఉండటం వలన బస్సు అటుగా తిప్పడం కష్టమని ఆర్టీసీ అధికారులు చేతులు ఎత్తేశారు. అయితే ప్రమాదభరిత మలుపులను గుర్తించి బస్సు నడిపేందుకు అవసరమైన విధంగా మలుపుల వద్ద రహదారిని వెడల్పు చేయాల్సి ఉంది. కానీ ఏళ్లు కావస్తున్నా అధికారులు ఆ దిశగా కనీసం దృష్టిసారించడం లేదనే చెప్పాలి. రహదారి అలంకార ప్రాయంగా మారింది. ప్రస్తుతం అటుగా ప్రైవేటు వాహనాలు తిరుగుతున్నాయి. పలు సందర్భాల్లో పరిమితికి మించి ప్రయాణికులను తీసుకువెళ్లడంతో ప్రమాదాలకు గురై పలువురు గిరిజనులు మృతి చెందగా పదుల సంఖ్యలో గిరిజనులు ఆసుపత్రిపాలైన సంఘటనలు ఉన్నాయి. అయినా, వివిధ పనుల నిమిత్తం మండల కేంద్రంతో పాటు వారపు సంతలు, వివిధ ప్రాంతాలకు వెళ్లేందుకు ప్రైవేటు వాహనాలను ఆశ్రయించడక తప్పడంలేదని ఈ ప్రాంత గిరిజనులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారుల నిర్లక్ష్యం వల్ల సుమారు నాలుగు పంచాయతీలకు సంబంధించి ప్రజలు రవాణా కష్టాలు ఎదుర్కొంటున్నారు.



లక్ష్మీపురం మార్గంలో నిర్మించి బీటీ రహదారి

### బస్సు నడపకుంటే ఆందోళన చేపడతాం



లక్ష్మీపురం మార్గంలో ఆర్టీసీ బస్సు సర్వీసును నడపాలని అధికారులకు ఎన్నిసార్లు వినతులిచ్చి పట్టించుకోవడంలేదు. గత్యంతరంలేక ప్రైవేటు వాహనాల్లో రాకపోకలు సాగిస్తున్నాం. పలు సందర్భాల్లోప్రమాదాలకు గురౌతున్నారు. ఇప్పటికే ఈ మార్గంలో జరిగిన వాహన ప్రమాదాల్లో సుమారు ఆరుగురు మృతి చెందగా.. పదుల సంఖ్యలో ఆసుపత్రి పాలయ్యారు. అటుగా బస్సు సర్వీసును నడపకుంటే ఆందోళన చేపతాం.

- కె. త్రినాథ్, లక్ష్మీపురం పంచాయతీ సర్పంచ్

## ఆదివాసీలకు సాయమందించాలి: లయన్స్ పూర్వ గవర్నర్




గిరిజనులకు దుస్తులు, వ్యవసాయ పనిముట్లు పంపిణీ చేస్తున్న లయన్స్ పూర్వ జిల్లా గవర్నర్ రాఘవేంద్రరావు

గూడెంకొత్తవీధి, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): ఆదివాసీలకు సాయమందించేందుకు స్వచ్ఛంద సంస్థలు ముందుకు రావాలని లయన్స్ పూర్వ జిల్లా గవర్నర్, నర్సీపట్నం యూత్ హాస్టల్ సభ్యులు డి. రాఘవేంద్రరావు అన్నారు. ఆదివారం మండలంలోని పెదవలస పంచాయతీ పరిధి రంపుల, పిల్లిగొంది, కొక్కితపాడు, డోకులూరు, బంధవీధి, చాపరాతిపాలెం, పెదలంక, తియ్యమామిడి గ్రామాల్లో ని ఆదివాసీలకు రగ్గులు, చీరలు, పంచెలు, వ్యవసాయ పనిముట్లు పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుత చలి దృష్ట్యా ఆదివాసీలు దుస్తులు, వ్యవసాయ పనిముట్లు పంపిణీకి స్పందన చేయత ఫౌండేషన్, సద్భావన చారిటబుల్ ట్రస్టు, హైదరాబాద్ రోటరీ క్లబ్, వైజాగ్ స్మార్ సిటీ, అనకాపల్లి హెల్పింగ్‌హార్ట్స్ అరుణోదయ ఫౌండేషన్, అభయం ఫౌండేషన్, లయన్స్ క్లబ్, స్టీల్ సిటీ, మీనాహరి చారిటబుల్ ట్రస్టులు ముందుకొచ్చాయన్నారు. రంపుల పాఠశాలలో ఎన్‌జీవో ప్రతినిధులు మొక్కలు నాటారు. ఈకార్యక్రమంలో నర్సీపట్నం యూత్ హాస్టల్ కో కన్వీనర్ అధికారి గోపాలరావు, స్పందన చేయూత ఫౌండేషన్ చైర్మన్ ఈపూరి బుచ్చిరాజు, ఎన్‌జీవో ప్రతినిధులు ఈపూరీ సీతారామరాజు, ఆనంద్, కిశోర్, యోగేశ్ కుమార్ గార్గ్, వేణు, హరికృష్ణ, హెచ్‌ఎం పనసల ప్రసాద్, వైస్ ఎంపీపీ సప్పగెడ్డ ఆనంద్, స్వంచ్ పాంగి కృష్ణవంశీ పాల్గొన్నారు.

## మన్యం బిడ్డ కరుణకుమారికి సత్కారం



టీ-20 క్రికెట్ వరల్డ్ కప్ విజేత కరుణకుమారి అభినందన సభలో మాట్లాడుతున్న గిడ్డి ఈశ్వరి

పాడేరురూరల్, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): అంధుల మహిళా టీ-20 క్రికెట్ వరల్డ్ కప్ విజేతగా నిలిచి తొలిసారిగా స్వగ్రామమైన వంట్లమామిడికి శనివారం రాత్రి వచ్చిన పాంగి కరుణకుమారికి టీడీపీ పాడేరు నియోజకవర్గ ఇన్‌చార్జి గిడ్డి ఈశ్వరి, తెలుగు మహిళా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బొర్రా విజయరాణి, డిప్పల వెంకటకుమారి, సర్పంచ్‌లు, ప్రజలు స్వాగతం పలికారు. పాడేరు మండలం వంట్లమామిడికి చెందిన పాంగి రాంబాబు, సంధ్యల కుమార్తె కరుణకుమారి విశాఖ అంధుల పాఠశాలలో 10వ తరగతి చదువుతూ ఇటీవల జరిగిన అంధుల మహిళా టీ-20 క్రికెట్ వరల్డ్ కప్‌లో పాల్గొని విజేతగా నిలిచారు. శనివారం రాత్రి స్వగ్రామం రావడంతో గిడ్డి ఈశ్వరి పార్టీ మహిళా శ్రేణులతో కలిసివెళ్లి కరుణకుమారికి పూలమాలలతో సత్కరించి స్వాగతం పలికారు. అనంతరం నిర్వహించిన అభినందన సభలో ఆమె మాట్లాడారు. ఆర్థిక సహాయాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో వంట్లమామిడి సర్పంచ్ రాంబాబు, ఎంపీటీసీ సభ్యుడు ఈశ్వరరావు, సలుగు, ఐనాడ, దేవాపురం సర్పంచ్‌లు, పరిసర గ్రామాల ప్రజలు, క్రీడాభిమానులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## ఘనంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం

సీలేరు, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి) :సీలేరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని 1991- 92 బ్యాచ్ పదో తరగతి విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం ఘనంగా నిర్వహించారు. వీరంతా 33 సంవత్సరాల తరువాత సుమారు 40 మంది వివిధ ప్రాంతాల్లో స్థిరపడిన వారంతా కలుసుకున్నారు. బాల్యం నాటి జ్ఞాపకాలను నెమరువేసుకుని సరదాగా గడిపారు. చిన్నతనంలో తాము సీలేరులో జెన్‌కో కాలనీలో క్రాస్ రోడ్డులో ఎక్కడెక్కడ ఉండేవారో ఆయా ప్రదేశాలకు కూడా వెళ్లి అనుభూతులను గుర్తుతెచ్చుకుని పులకరించిపోయారు. ఈ సందర్భంగా అప్పట్లో సైన్స్ ఉపాధ్యాయుడిగా ఇక్కడ పని చేసిన సత్యనారాయణ మాస్టారు దంపతులకు సన్మానించారు.



గురువు దంపతులను సన్మానిస్తున్న పూర్వ విద్యార్థులు

ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు మదీనావల్లీ, పల్లా వెంకటేశ్వరరావు, పాపారావు, త్రినాద్, మంగరాజు, మణిచంద్ర, నాగేశ్వరి, ఈశ్వరి, సుజాత, రమణమ్మ, తదితరులు పాల్గొన్నారు.

## ప్రశాంతంగా ఎన్ఎంఎంఎస్ పరీక్షలు



పాడేరు కేంద్రంలో పరిశీలిస్తున్న జిల్లా అసిస్టెంట్ కమిషనర్ శశికుమార్

పాడేరురూరల్, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): జిల్లావ్యాప్తంగా ఆదివారం జాతీయ ఉపకార వేతన (ఎన్ఎంఎంఎస్) పరీక్షలు ప్రశాంతంగా జరిగాయని డీఈవో పాటోజు బ్రహ్మాజీరావు, ప్రభుత్వ పరీక్షల జిల్లా అసిస్టెంట్ కమిషనర్ ఆర్.శశికుమార్ తెలిపారు. ఆదివారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు జిల్లాలోని పాడేరు, చింతపల్లి, రంపచోడవరం, వీఆర్.పురం, చింతూరు పరీక్ష కేంద్రాలలో నిర్వహించిన ఈ పరీక్షలకు 727 మంది విద్యార్థులు హాజరుకావాల్సి ఉండగా 678 (93 శాతం)మంది హాజరయ్యారన్నారు. జిల్లా అసిస్టెంట్ కమిషనర్ శశికుమార్, ఎన్ఎంఎంఎస్ జిల్లా నోడల్ అధికారి జె.నాగేంద్రబాబు పాడేరు పరీక్ష కేంద్రాన్ని పరిశీలించారు. మిగిలిన 4 పరీక్ష కేంద్రాలను ఎంఈవోల ఆధ్వర్యంలో ఫ్లైయింగ్ స్క్వాడ్లు పర్యవేక్షించాయన్నారు.

## గ్రామాల్లో ఎన్ఎస్ఎస్ సేవా కార్యక్రమాలు

అరకులోయ, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): అరకులోయ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆధ్వర్యంలో ఎన్ ఎస్ఎస్ దత్తత గ్రా మాలైన రవ్వలగుడ, ఆర్.డుంబ్రిగుడల్లో వలంటీర్లు సేవా కార్యక్రమాలు చేపట్టారు. కళాశాలకు చెందిన రెండు ఎన్ఎస్ఎస్ బృందాలు ఈ గ్రామాలలో గత వారం రోజు లుగా పలు సేవా కార్యక్రమాలు చేపడుతున్నాయి. ఆదివారం గ్రామాలలో పారిశుధ్య పనులు చేపట్టారు. వాటర్ ట్యాంకులను శు భ్రం చేశారు. పరిసరాలు పరిశుభ్రం గా ఉంచాలని, మూఢనమ్మకాలు దూరంగా ఉండాలని గ్రామస్థులకు అవగాహన కల్పించారు. బాల్యవివాహాలు చేయరాదని, బడిఈడు పిల్లలంతా చదువుకునేలా చూడాలని కోరారు. విద్యతోనే అభివృద్ధి సాధ్యమని గిరిజనులకు వివరించారు. ఈ మేరకు అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ కా ర్యక్రమాలను ఎన్ఎస్ఎస్ పీవోలు విజయలక్ష్మి, అనితకుమారి, నాగబాబు పర్యవేక్షించారు.



ఆర్.డుంబ్రిగుడలో వాటర్ ట్యాంకును శుభ్రం చేస్తున్న ఎన్ఎస్ఎస్ వలంటీర్లు.

## ఆదమరిస్తే... అంతే!

- కాకరపాడు- కొయ్యూరు మధ్య ప్రధాన రహదారిపై గొయ్యి

కొయ్యూరు, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): శింగవరం ఐటీడీఏ కాలనీ వద్ద గల అటవీ శాఖ కలప డిపో సమీపాన కాకరపాడు- కొయ్యూరు మధ్య ప్రధాన రహదారిపై గొయ్యి ప్రమాదకరంగా మారింది. ములకలపాడు చెక్‌డ్యాం నుంచి రోడ్డుకు ఇటువైపు పొలాలకు నీరు వెళ్ళేందుకు వీలుగా రహదారికి మధ్యలో నిర్మించిన కల్వర్టు శిథిలావస్థకు చేరింది. వాహన రాకపోకలతో పదిరోజుల క్రితం మరింత కుంగిపోయి గొయ్యి పడింది. కల్వర్టుకు వేసిన సిమెంట్ తూరలకు కాలం చెల్లటంతో వీటిపైన గొయ్యి రోజురోజుకు మరింత పెద్దదవుతోంది. ఈ ప్రదేశంలో ప్రమాదాలు జరగకుండా స్థానికులు రెడ్ స్టిక్కర్లతో కూడిన కర్రను గొయ్యిపై ఉం చారు. అయినా, రాత్రి వేళల్లో ఇక్కడి గొయ్యి ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి.ఆర్అండ్‌బీ అధికారులు స్పందించి కల్వర్టును పునర్నిర్మాణంతో పాటు ప్రస్తుతం గోతిని తాత్కాలికంగా పూడ్చాలని వాహన చోదకులు కోరుతున్నారు.



శింగవరం ఐటీడీఏ కాలనీ వద్దప్రమాదకరంగా ప్రధాన రహదారిపై పడిన గొయ్యి

# థింసా నృత్య ప్రదర్శనలతో గిరిజన మహిళలకు ఉపాధి

చింతపల్లి, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రకశ్మీర్ లంబసింగిలో ఆదివాసీ మహిళలు థింసా నృత్యం ప్రదర్శిస్తూ పర్యాటకులకు వినోదాన్ని పంచడంతోపాటు ఉపాధి పొందుతున్నారు. ఆదివాసీల సాంప్రదాయ నృత్యం థింసాకు దేశ వ్యాప్తంగా ప్రత్యేక గుర్తింపువుంది. ఈనృత్యాన్ని వీక్షించేందుకు మైదాన ప్రాంత ప్రజలతోపాటూ గిరిజనులు సైతం ఆసక్తి చూపుతున్నారు. దీంతో పాడేరు ఐటీడీఏ, పంచాయతీ సహకారంతో చెరువులవేనం ముఖద్వారమైన భీమనాపల్లి గ్రామం వద్ద ఆదివాసీ గిరిజన థింసా నృత్యం కమిటీ సభ్యులు ప్రత్యేక ప్రదర్శన వేదికను ఆదివారం ఏర్పాటు చేశారు. ఆదివాసీ మహిళలు పర్యాటక సీజన్ ముగిసే వరకు థింసా నృత్యాన్ని ప్రతి రోజు ఉదయం ఆరు గంటల నుంచి 11గంటల వరకు, సాయంత్రం ఆరు గంటల నుంచి రాత్రి ఎనిమిది గంటల వరకు ప్రదర్శించనున్నట్టు నిర్వహకుడు బొబ్బిలి కామేశ్వరరావు తెలిపారు. ఈ నృత్యానికి ఆధునిక స్టెప్పులను జోడించి లయబద్ధంగా, ఆకట్టుకునేలా ఆదివాసీ మహిళలు ప్రదర్శిస్తుండడంతో తిలకించేందుకు పర్యాటకులు ఆసక్తి చూపుతున్నారు. ఈవేదిక వద్ద ప్రవేశించేందుకు పెద్దల నుంచి రూ.30, పిల్లల నుంచి రూ.10 ధరలను కమిటీ సభ్యులు వసూలు చేస్తున్నారు. గిరిజన మహిళలు స్వయం ఉపాధి పొందుతూ వినోదాన్ని పంచడాన్ని పర్యాటకులు స్వాగతిస్తున్నారు. మహిళలతో కలిసి స్టెప్పులు వేస్తున్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కొర్ర శాంతి, మాజీ సర్పంచ్ రఘునాథ్, వీఆర్వో వి. సదానందరావు, పెసా కమిటీ ఉపాధ్యక్షుడు భలరామ్ పాల్గొన్నారు.



గిరిజన మహిళలతో కలిసి స్టెప్పులేస్తున్న పర్యాటకులు

## యువత గంజాయి, డ్రగ్స్‌కు దూరంగా ఉండాలి: ఎస్పీ




వంజంగి మేఘాల కొండ వద్ద మారథాన్‌ను ప్రారంభిస్తున్న ఎస్పీ అమిత్ బర్దార్

పాడేరురూరల్, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): గిరిజన యువత గంజాయి, డ్రగ్స్ వంటి మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని ఎస్పీ అమిత్ బర్దార్ పిలుపునిచ్చారు. మండలంలో ప్రముఖ పర్యాటక ప్రాంతమైన వంజంగి మేఘాల కొండ వద్ద ఆది వారం ఉయదం ఆయన 100 మంది గిరిజన యువకులతో గంజాయి, డ్రగ్స్‌కు వ్యతిరేకంగా 5 కిలోమీటర్ల మారథాన్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉంటూ, విద్యపై శ్రద్ధ వహించి ఉన్నత శిఖరాలను చేరుకోవాలన్నారు. తల్లిదండ్రులు పాఠశాల, కళాశాలలు, పుట్టి పెరిగిన గ్రామాలకు, జిల్లాకు వన్నెతేవాలన్నారు. పర్యాటకులతో ఆయన కాసేపు ముచ్చటించి పర్యాటక ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచాలని, ప్లాస్టిక్ వినియోగం తగ్గించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ షేక్ షహబాజ్ అహమ్మద్, సీఐ డి.దీనబంధు, ఎస్ఐ ఎల్.సురేష్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## ఆస్పత్రికి ఆక్సిజన్ సిలిండర్లు వితరణ




ఆక్సిజన్ సిలిండర్లు అందిస్తున్న ఓఎన్‌జీసీ వైద్యాధికారి రామ్మోహన్

పాడేరురూరల్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): పాడేరు ప్రభుత్వ సర్వజన ఆసుపత్రికి రాజమండ్రి ఓఎన్‌జీసీ యాజమాన్యం ఆదివారం 60 ఆక్సిజన్ సిలిండర్లు, ఆక్సిజన్ కాన్సన్‌ట్రేటర్స్‌ను విరాళంగా అందించినట్టు ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్. హేమలతాదేవి తెలిపారు. సీఎస్ఆర్ కార్యకలాపాల్లో భాగంగా ఓఎన్‌సీకి చెందిన డాక్టర్.పోలుమూరు గోవింద ఓఎన్‌జీసీ వైద్యాధికారి రామ్మోహన్ ద్వారా సమకూర్చారు. ఈ సిలిండర్లు ఓటీఎస్, ఎస్ఎన్‌సీయూ క్యాజువాలిటీతో పాటు అంబులెన్స్‌లో రవాణా చేసేటపుడు ఉపయోగపడతాయని ఆమె తెలిపారు.

## ఆంధ్రప్రదేశ్ హ్యూమన్ రైట్స్ వైస్ చైర్మన్‌గా రామకృష్ణ




బాధ్యతలు స్వీకరిస్తున్న రామకృష్ణ

పాడేరురూరల్, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి):ఆంధ్రప్రదేశ్ హ్యూమన్ రైట్స్ రాష్ట్ర వైస్ చైర్మన్‌గా నాడేలి రామకృష్ణ నియమితులయ్యారు. ఈ సందర్భంగా 7వ తేదీ ఆదివారం గుం టూ రులో నగర డిప్యూటీ మేయర్ సజీలా ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో పాల్గొన్న హ్యూమన్ రైట్స్ ప్రతినిధి వెంకటేశ్వర్లు, హ్యూమన్ రైట్స్ యాంటీ కరప్షన్ నేషనల్ డైరెక్టర్ పవన్ కుమార్, తిరుపతయ్య, వెంకట శివరామకృష్ణలు రాష్ట్ర వైస్ చైర్మన్‌గా రామకృష్ణను నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో సౌత్ ఇండియా హ్యూమన్ రైట్స్ ప్రతినిధులు, సభ్యులు, ఏపీ, తెలంగాణ లీగల్ అడ్వయిజర్లు పాల్గొన్నారు.

## ద్విచక్ర వాహనాల చోరీపై అప్రమత్తం: ఎస్ఐ

చింతపల్లి, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో ద్విచక్ర వాహనాల దొంగతనాలను అరికట్టేందుకు ప్రజలు అప్రమత్తంగా ఉండాలని స్థానిక ఎస్ఐ ఎం. వెంకట రమణ అన్నారు. ఆదివారం రాత్రి సబ్ ఇన్‌స్పెక్టర్, పోలీసులు పెట్రోలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మండల కేంద్రంలో తరచూ ద్విచక్రవాహనాల దొంగతనాలు జరుగుతున్నాయన్నారు. గృహాల బయటపెట్టిన వాహనాలను చాకచక్యంగా దొంగిలిస్తున్నారన్నారు. వాహనల దొంగతనాలను అరికట్టేందుకు ఎస్పీ అమిత్ బర్దర్, ఏఎస్పీ నవజ్యోతి మిశ్రా ఆదేశాలతో స్థానిక సీఐ ఎం. వినోద్‌బాబు పర్యవేక్షణలో రాత్రి ఏడు గంటల నుంచి మరుసటి రోజు ఉదయం ఆరు గంటల వరకు పెట్రోలింగ్ చేస్తున్నామన్నారు. వీధుల్లో, గృ హ పరిసరాల్లో అపరిచితులు అనుమానితంగా సంచరిస్తున్నట్టు గుర్తిస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. వాహనాలను ఆరుబయట వదిలిపెట్టకుండగా గృహాల్లో భద్రపర్చి లాక్ చేసుకోవాలన్నారు. దుకాణాల యజమానులు కచ్చితంగా సీసీ కెమెరాలను ఏర్పాటు చేయాలన్నారు.

# కొళాయిల్లో బురద నీరు

... 5వ పేజీ తరువాయి

ట్యాంకులలోకి నీరు సరిగా సరఫరా కావడం లేదు. ఫలితంగా కొళాయిల ద్వారా తాగునీటి సరఫరా అస్తవ్యస్తంగా తయారైంది. ఇటువంటి పరిస్థితుల్లో కొన్ని వార్డులకు ట్యాంకర్ల ద్వారా తాగునీటిని పంపుతుండగా, మిగిలిన చోట్ల స్థానికులు తాగునీటి కోసం బోర్లు లేదా ఆర్‌వో ప్లాంట్లను ఆశ్రయిస్తున్నారు. ఇప్పటికైనా పంచాయతీ అధికారులు ఈ రెండు ట్యాంకుల ద్వారా కలుషిత నీరు సరఫరా కాకుండా చర్యలు చేపట్టడంతో పాటు, ప్రతి రోజూ తాగునీటి సరఫరా సరిగ్గా అయ్యేలా చర్యలు చేపట్టాలని స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు.

# పరాయి పంచన పాట్లు

... 5వ పేజీ తరువాయి

కొన్ని ప్రభుత్వ శాఖల కార్యాలయాలను పట్టణానికి శివారులో, సమీపంలోని మండలాల్లో ఏర్పాటు చేశారు. పట్టు పరిశ్రమ కార్యాలయాన్ని సబ్బవరం మండలం అసకపల్లిలో ఒక చిన్న ప్రైవేటు భవనంలో నడుపుతున్నారు. దాదాపు అన్ని ప్రభుత్వ శాఖల కార్యాలయాలు అద్దె భవనాలు, ఇరుకు గదుల్లో నిర్వహిస్తుండడంతో ఉద్యోగులు, వివిధ పనుల నిమిత్తం వచ్చే ప్రజలు అసౌకర్యానికి గురవుతున్నారు.

### అనకాపల్లికి రాని కేంద్ర ప్రభుత్వ శాఖలు

అనకాపల్లి కేంద్రంగా కొత్త జిల్లా ఏర్పడి మూడున్నరేళ్లు దాటినప్పటికీ కేంద్ర ప్రభుత్వ శాఖలు ఇంకా విశాఖ నుంచి అనకాపల్లికి తరలించలేదు. పరవాడ, అచ్యుతాపురం, రాంబిల్లి మండలాల్లో ఔషధ తయారీ పరిశ్రమలు ఎక్కువగా ఉన్నాయి. వీటికి సంబంధించి కాలుష్య నియంత్రణ మండలి కార్యాలయాన్ని అనకాపల్లిలో ఏర్పాటు చేయలేదు. ఎన్‌హెచ్ఏఐ, కేంద్ర వాణిజ్య పన్నులు, ఇతర కేంద్ర ప్రభుత్వ శాఖల కార్యాలయాలన్నీ విశాఖలోనే కొనసాగుతున్నాయి. కూటమి అధికారంలోకి వచ్చిన తరువాత అనకాపల్లిలో ఎన్ని కార్యాలయాలు అద్దె భవనాల్లో ఉన్నాయి? ఏయే శాఖలకు భవనాలు నిర్మించాలి అన్న వివరాలను జిల్లా అధికారులు ఇప్పటికే ప్రభుత్వానికి పంపారు.

# గంజాయి కట్టడిపై డేగ కన్ను

... 5వ పేజీ తరువాయి

నిఘా పెట్టారు. గంజాయి నిల్వ చేసే శిబిరాలపై దాడులు జరుపుతున్నారు. ఇదే సమయంలో అన్ని పోలీసు స్టేషన్‌ల పరిధిలో సీఐలు, ఎస్ఐలు ప్రత్యేక బృందాలుగా ఏర్పడి గంజాయి, మాదకద్రవ్యాలు వంటివాటిని వినియోగించే శివారు ప్రదేశాలు, వినియోగంలో లేని భవనాలు, ఖాళీ స్థలాల్లో డ్రోన్ల సాయంతో పరిశీలించి, మెరుపు దాడులు నిర్వహిస్తున్నారు. అనుమానితులను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు.

### ప్రజల సహకారంతో..



జిల్లాలో గంజాయి రవాణా, మాదకద్రవ్యాల వినియోగాన్ని సమూలంగా అరికట్టేందుకు ప్రజల సహకారం తీసుకుంటున్నాం. గ్రామాల్లో సైతం రాత్రి బీట్‌లు ఏర్పాటు చేసి ప్రత్యేక నిఘా బృందాలను నియమించాం. గంజాయి రవాణా, మాదక ద్రవ్యాల వినియోగంపై సమాచారం ఇచ్చిన వారి పేర్లను గోప్యంగా ఉంచుతామన్నారు.

- తుహిన్ సిన్హా, ఎస్పీ




షోరూమ్ ప్రారంభిస్తున్న స్పీకర్ అయ్యన్నపాత్రుడు, పద్మావతి దంపతులు.. (ఇన్‌సెట్‌లో) ఆభరణాలు ప్రదర్శిస్తున్న నిధిఅగర్వాల్

# సినీ తార నిధి అగర్వాల్ సందడి

## నర్సీపట్నంలో సీఎంఆర్ జువెలరీ షోరూమ్ ప్రారంభించిన స్పీకర్ అయ్యన్నపాత్రుడు, పద్మావతి దంపతులు

నర్సీపట్నం, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): అందాల తార నిధి అగర్వాల్ సీఎంఆర్ జువెలరీ షోరూమ్ ప్రారంభోత్సవం సందర్భంగా సందడి చేశారు. ఆదివారం స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు, పద్మావతి దంపతులు జువెలరీ షోరూమ్‌ను ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి విచ్చేసిన హీరోయిన్ నిధి అగర్వాల్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. సీఎంఆర్ యజమాని మావూరి వెంకటరమణతో కలిసి ఆధునిక మోడల్స్‌లో ఉన్న బంగారం, వెండి ఆభరణాలు ప్రదర్శించారు. షోరూమ్‌కు వచ్చిన కస్టమర్లు సినీతారతో సెల్ఫీలు దిగడానికి ఎగబడ్డారు. కాగా, సీఎంఆర్ అధినేత వెంకటరమణ వ్యాపారవేత్త మాత్రమే కాదని, సామాజిక సేవకుడిగా మంచి పేరుందని స్పీకర్ అయ్యన్నపాత్రుడు అన్నారు. నర్సీపట్నంలో రూ.30 లక్షలతో శ్మశానవాటికను అభివృద్ధి చేశారని తెలిపారు. బంగారం కొనుగోలుకు విశాఖపట్నం వరకు వెళ్లే అవసరం లేకుండా నర్సీపట్నంలో షోరూమ్ తెరిచామని మావూరి వెంటకరమణ చెప్పారు.

### ఘనంగా నూకాలమ్మతల్లి పండగ



అలంకరణలో అమ్మవారు

రావికమతం, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): మండలంలో మేడివాడ నూకాలమ్మ దేవత పండగను ఆదివారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆదివారం తెల్లవారు జాము నుంచే భక్తులు అమ్మవారి దర్శనం కోసం బారులు తీరారు. పసుపు, కుంకుమ, చీరలు, రవికలు, గాజులు వివిధ కానుకలు ఇచ్చి మొక్కులు తీర్చుకున్నారు. ఈ సందర్భంగా భారీ విద్యుత్ దీపాలంకరణ, పలు సాంస్కృతిక కార్యక్రమాలతో పాటు పెద్ద ఎత్తున బాణసంచా ఏర్పాటు చేశారు. అలాగే, ఈ గ్రామంలో ఒకే చోట అమ్మవారికి రెండు వేర్వేరుగా ఆలయాలుండడం విశేషం.



అమ్మవారి దర్శనం కోసం బారులు తీరిన భక్తులు

### పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక



ఒకే చోట కలుసుకున్న పూర్వ విద్యార్థులు

దేవరాపల్లి, డిసెంబరు7 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు ఉన్నత స్థానానికి చేరినప్పుడే గురువులకు వృత్తి పరమైన సంతృప్తి కలుగుతుందని కృష్ణ మాష్టారు అన్నారు. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 1997-98 సంవత్సరం పదోతరగతి చదువుకున్న విద్యార్థులు మండలంలో తెనుగుపూడి గ్రామ సమీపంలో ఆత్మీయ సమావేశం ఆదివారం ఏర్పాటు చేశారు. ఉపాధ్యాయులు కృష్ణమాష్టారు. భుజంగరావు, జగదీష్, గోవర్ధన్, శీలా.సత్యారావు, బి.అప్పారావు, ఎల్.సత్యనారాయణ, దీవి. అప్పలరాజులను పూర్వ విద్యార్థులు సత్కరించారు. గత జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. మధ్యాహ్నం సహ పంక్తి భోజనాలు చేశారు. సాయంత్రం వరకు ఆనందంగా గడిపారు.

### పరుగు పందెంలో దివ్యాంగ విద్యార్థి ప్రతిభ



డీఈవోనుంచి మెడల్, ప్రశంస పత్రం అందుకొంటున్న ప్రసాద్

బుచ్చెయ్యపేట డిసెంబరు 7(ఆంధ్ర జ్యోతి): మండలంలో దిబ్బిడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 8 వ తరగతి చదువుతున్న దివ్యాంగ విద్యార్థి పల్లి ప్రసాద్ జిల్లా స్థాయి 400 మీటర్ల పరుగు పందెంలో ప్రథమ స్థానాన్ని సాధించాడు. త్వరలో రాష్ట్ర స్థాయి పోటిలలో ప్రసాద్ పాల్గొనున్నాడు. శనివారం ఎఎమ్‌ఎఎల్ కాలేజీలో డీఈవో గిడ్డి అప్పారావు నాయుడు నుంచి మెడల్, ప్రశంస పత్రం అందుకున్నారు. ఈ సందర్భంగా ప్రసాద్‌ను ప్రధానోపాధ్యాయులు సత్యారావు, ఉపాధాయులు, ప్రత్యేక ఉపాధ్యాయులు బి. అప్పలరాజు, సిబ్బంది అభినందించారు. ఈ కార్యక్రమంలో నితిన్ ఫౌండేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

### విధుల్లో చేరిన ఐదుగురు ఏఎన్‌ఎంలు

చీడికాడ, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): మండలంలో చీడికాడ పీహెచ్‌సీ పరిధిలోని ఐదు సబ్‌సెంటర్‌లకు ఏఎన్‌ఎంలు విధుల్లో చేరినట్టు స్థానిక వైద్యాధికారి సునీల్‌కుమార్ ఆదివారం తెలిపారు. చీడికాడ, మంచాల, కోనాం, ఖండివరం, అప్పలరాజుపురం సబ్‌సెంటర్‌లకు జిల్లా అధికారులు కొత్తగా ఏఎన్‌ఎంలను నియమించినట్టు చెప్పారు.

### పేకాటరాయుళ్లు అరెస్టు

రావికమతం,డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గుడ్డిప గ్రామం శివారులో పేకాడుతున్న ఐదుగురు వ్యక్తులను ఆరెస్టు చేసినట్టు స్థానిక ఎస్.ఐ.ఎం.రఘు వర్మ తెలిపారు. ముందస్తు సమాచారం మేరకు శనివారం రాత్రి తమ సిబ్బంది దాడి చేయగా పేకాట రాయుళ్ల పట్టుపడ్డారన్నారు. వీరినుంచి మూడు సెల్‌ఫోన్లు, రెండు బైక్‌లు, రూ. 24,560 స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశామన్నారు.

### అసభ్యకర నృత్యాలు చేయించిన వారిపై కేసు నమోదు

కె.కోటపాడు, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): గొండుపాలెం సమీపాన ఓ రిస్టార్స్‌లో ఈ నెల ఒకటో తేదీ రాత్రి సమయంలో అసభ్యకర నృత్యాలు చేయించిన వ్యక్తులపై కేసు నమోదు చేసినట్టు స్థానిక సర్కిల్ ఇన్‌స్పెక్టర్ పి. పైడపునాయుడు తెలిపారు. గొండుపాలెం సమీపాన ఓ రిస్టార్స్‌లో అసాంఘిక కార్యకలాపాలు జరుగుతున్నాయని సమాచారం మేరకు దాడులు నిర్వహించామన్నారు. ఈ దాడిలో బుచ్చెయ్యపేటకు చెందిన ఆర్గనైజర్, చీడికాడ మండలం భైలపూడికు చెందిన ఏడుగురు పురుషులు, ఇద్దరు మహిళలను అదుపులోకి తీసుకున్నామన్నారు. డ్యాన్స్ ప్రోగ్రాం పేరుతో అనకాపల్లి నుంచి మహిళలను పిలిపించి రిసోర్ట్‌లో నిర్బంధించి బలవంతంగా వారితో అసభ్యకర నృత్యాలు చేయించినట్లుగా ప్రాథమిక విచారణలో తేలిందన్నారు. ఏడుగురు పురుషులను, ఒక ఆర్గనైజరును అరెస్టు చేసి చోడవరం కోర్టుకు తరలించామని సీఐ తెలిపారు.

# గిరిజనుల సేవకు తరలిన స్వచ్ఛంద సంస్థలు



జెండా ఊపి బస్సును ప్రారంభిస్తున్న డాక్టర్ అధికారి గోపాలరావు

నర్సీపట్నం, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): గిరిజనులకు ఉపయోగపడే సామగ్రి పంపిణీ చేయడానికి స్వచ్ఛంద సేవా సంస్థల ప్రతినిధులు తరలివెళ్లారు. నర్సీపట్నం నుంచి ఏజెన్సీ ప్రాంతానికి బస్సులో బయలుదేరి వెళ్లారు. యూత్ హాస్టల్ అడ్‌హక్ కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం లయన్స్ క్లబ్ పూర్వపు గవర్నర్ డాక్టర్ అధికారి గోపాలరావు, దస్ర్తాల రాఘవేంద్రరావు ఈ కార్యక్రమాన్ని జెండా ఊపి ప్రారంభించారు. ఏఎస్ఆర్ జిల్లా గూడెంకొత్తవీధి మండలం రంపుల, పిల్లిగొంది, కొక్కితపాడు, దొగులూరు, బంధవీధి, చాపరాతిపాలెం, పెదలంక, తియ్యమామిడి గ్రామాల్లో నివసిస్తున్న గిరిజనులకు ఉపయోగ పడే సామగ్రి పంపిణీ చేయడానికి వీరంతా వెళ్లారు. స్పందన చేయూత ఫౌండేషన్, హైద్రాబాద్‌కు చెందిన సద్భావన చారిటబుల్ ట్రస్ట్, అనకాపల్లి హెల్పింగ్ హార్ట్స్, అరుణోదయ ఫౌండేషన్, అభయ ఫౌండేషన్, లయన్స్ క్లబ్ స్టీల్ సిటి, మీనాహరి చారిటబుల్ ట్రస్టుకు సంబంధించిన దాతలు రగ్గులు, వ్యవసాయ పనిముట్లు, చలి దుస్తులు, స్వెట్టర్లు, మంకీ క్యాపులు, చీరలు, గొడుగులు తదితర సామగ్రిని 150 మంది గిరిజనులకు పంపిణీ చేయడానికి ప్రత్యేక బస్సులో ఏజెన్సీ గ్రామాలకు బయలుదేరినట్టు యూత్ హాస్టల్ కన్వీనర్ పాలవర్తి సత్యానందం తెలిపారు.

## నవోదయ నమూనా పరీక్ష

నర్సీపట్నం, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో పీఆర్‌టీయూ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన నవోదయ నమూనా పరీక్షకు విశేష స్పందన లభించింది. నర్సీపట్నం నలంద ఇంగ్లీషు మీడియం పాఠశాలలో జరిగిన ఈ పరీక్షకు వివిధ మండలాల నుంచి 340 మంది హాజరయ్యారని పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు డీజీనాథ్ తెలిపారు. నమూనా పరీక్ష రాయడం వల్ల విద్యార్థులు నవోదయ పరీక్ష రాసేటప్పుడు భయం పోతుందని ఆయన చెప్పారు.

## ఎన్జీవో సంఘం నూతన కార్యవర్గం



ఎన్‌జీవో సంఘం నూతన కార్యవర్గం ప్రతినిధులు

నర్సీపట్నం, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): ఎన్‌జీవో అసోసియేషన్ నర్సీపట్నం తాలుకా యూనిట్ కార్యవర్గం ఎన్నిక ఏకగ్రీవంగా జరిగింది. అబీద్ సెంటర్ ఎన్‌జీవోస్ భవనంలో ఆదివారం నామినేషన్ల ప్రక్రియ నిర్వహించారు. సంఘంలోని 15 పదవులు ఉండగా, ఒక్కొక్క పదవికి ఒక్కొక్క నామినేషన్ మాత్రమే పడటంతో ఎన్నిక ఏకగ్రీవమైనట్టు ఎన్నికల అధికారి రమణ, సహాయ ఎన్నికల అధికారి శ్రీనివాసరావు ప్రకటించారు. ఎన్జీవో అసోసియేషన్ అధ్యక్షుడిగా సిహెచ్.శ్రీనివాసరావు, కార్యదర్శిగా వై.కృష్ణ, కార్యనిర్వాహక కార్యదర్శిగా ఎస్.రాజశేఖర్, ఉపాధ్యక్షులుగా పి.చిరంజీవి, ఆర్.రామచంద్ర, టీఎస్ఎన్ నాగరాజు, కె.రవికిరణ్, కె.రాధాకుమారి ఎన్నికయ్యారు. సంయుక్త కార్యదర్శులుగా కె.శ్రీనివాసు, ఎం.శ్రీనివాసు, పి.నూకరాజు, సురేష్‌కుమార్, కె.రామలక్ష్మి, ట్రెజరర్‌గా శేషకుమార్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

## ఘనంగా హిందూ సమ్మేళనం



కోలాట ప్రదర్శన ఇస్తున్న మహిళలు

నర్సీపట్నం, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఎన్టీఆర్ మినీ స్టేడియంలో ఆర్ఎస్ఎస్, సమర సత సేవా ఫౌండేషన్, విశ్వ హిందూ పరిషత్ ధార్మిక సంస్థల ఆధ్వర్యంలో ఆదివారం హిందూ సమ్మేళనం నిర్వహించారు. చిన్నారులు భరతనాట్యం, సుందర కాండ పారాయణ, భగవద్గీత శ్లోకాలు ఆలపించారు. రఘుకుల తిలక రారా.. పాటకు మహిళల కోలాటం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. సమరసత సేవా ఫౌండేషన్ ప్రాంత ప్రయోజక్ ముద్దు సాయిరాం హిందూ ధర్మం విశిష్టత, కుటుంబ విలువలు, గోమాత గురించి వివరిచారు. విద్యాంజలి స్కూల్ కరస్పాండెంట్ యక్కల శాంతి మాట్లాడుతూ పిల్లలు సెల్ ఫోన్‌కు దూరంగా ఉండాలని సూచించారు. పిల్లలకు సుందరకాండ, భగవద్గీత శ్లోకాలు నేర్పించడం వల్ల విలువలు, మెరుగైన సంస్కృతి అలవర్చుకుంటారన్నారు. ఈ కార్యక్రమంలో చింతలపూడి నిర్మలాదేవి, అమృతేశ్వర నాట్య అకాడమీ డాన్స్ టీచర్ ఉమాదేవి, వెలగా నారాయణరావు తదితరులు పాల్గొన్నారు.

## గ్రామాల్లో దట్టంగా పొగ మంచు



నర్సీపట్నం అర్బన్: మండలంలోని పలు గ్రామాల్లో పొగమంచు దట్టంగా కురిసింది. చెట్టుపల్లిలో ఆదివారం ఉదయం నుంచి ఎనిమిది గంటల వరకూ మండు పడింది. దీంతో ఎదురెదురుగా ప్రయాణాలు సాగించిన వాహన చోదకులు తీవ్రమైన ఇబ్బందులు పడ్డారు.

## ధారమఠానికి పోటెత్తిన పర్యాటకులు

గొలుగొండ, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): ధారమఠంలో ఆదివారం పర్యాటకులు సందడి చేశారు. మండలంలోని పాతమల్లంపేటలోని ఉమాధార మల్లేశ్వర స్వామి ఆలయం మూడు జిల్లాలకు గుర్తింపు పొందింది. దీంతో ధారమఠం శివాలయం వద్ద జలజల పారే జలపాతలంలో స్నానాలు చేసి, ప్రకృతిలో సాయంత్రం వరకూ పర్యాటకులు గడిపారు. కుటుంబసమేతంగా ఇక్కడకు తరలివచ్చి వనభోజనాలు చేసి సంతోషంగా గడిపారు. విశాఖ జిల్లాతో పాటు తూర్పు గోదావరి జిల్లాలకు చెందిన పర్యాటకులు, విద్యార్థులు తరలివచ్చారు.

## అక్కరకురాని సచివాలయ భవనం

మాకవరపాలెం, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని భీమబోయినపాలెంలో సచివాలయ భవనం నిరుపయోగంగా మారింది. రూ.35 లక్షలతో నిర్మించిన ఈ భవనం అందుబాటులోకి రాకపోడంతో ఉద్యోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. లక్షల రూపాయలతో నిర్మించిన భవనం మూడేళ్లయినా అధికారులు ప్రారంభించకపోవడంపై స్థానిక ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో భవన నిర్మాణం చేపట్టారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండేళ్లయినా భవనం మాత్రం అందుబాటులోకి రాకపోవడం విచారకరమని స్థానికులు వాపోయారు. దీంతో శిథిల భవనంలోనే ఉద్యోగులు విధులు నిర్వహించాల్సి వస్తున్నదని వారు మండిపడ్డారు. ఇప్పటికైనా జిల్లా అధికారులు స్పందించి ఈ భవనం అందుబాటులోకి తీసుకురావాలని కోరారు.

## కేజీబీవీ ఎదుట తల్లిదండ్రుల ఆందోళన

గొలుగొండ, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని కస్తూర్బాగాంధీ విద్యాలయం ఎదుట ఆదివారం తల్లిదండ్రులు ఆందోళనకు దిగారు. సెలవు రోజు కావడంతో పిల్లలను చూడడానికి పలు గ్రామాల నుంచి తల్లిదండ్రులు తరలివచ్చారు. పాఠశాల సిబ్బంది వారిని అనుమతించలేదు. గొలుగొండ, కృష్ణాదేవిపేట, అమ్మపేట, కొత్తమల్లంపేట, చీడిగుమ్మల తదితర ప్రాంతాల నుంచి వ్యయప్రయాలకోర్చి వచ్చామని, పిల్లలను చూసే అవకాశం ఇవ్వకపోతే ఎలా అని వారంతా సిబ్బందిని ప్రశ్నించి నిరసన తెలిపారు. దీనిపై కేజీబీవీ ప్రిన్సిపాల్ సుధను వివరణ కోరగా, పాఠశాలలో విద్యార్థినులతో తల్లిదండ్రులు గడిపేందుకు నెలలో రెండో శనివారం మాత్రమే అనుమతి ఉందని తెలిపారు.

## సీసీ రోడ్లకు రూ.5.5 కోట్లు మంజూరు

నాతవరం, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వివిధ గ్రామాల్లో సీసీ రోడ్ల నిర్మాణానికి రూ.5.5 కోట్లు మంజూరయ్యాయని టీడీపీ మండల అధ్యక్షుడు ఎన్.వెంకటరమణ తెలిపారు. స్పీకర్ అయ్యన్నపాత్రుడు ఈ నిధులు మంజూరు చేశారని చెప్పారు. తాండవ ఛైర్మన్ కరక సత్యనారాయణతో కమిటీ వేసి ఎక్కడెక్కడ రోడ్లు నిర్మించాలనేది నిర్ణయించాలని స్పీకర్ సూచించినట్టు ఆయన చెప్పారు.

# ముందుకు సాగని మురుగుతో అవస్థలు

▸▸ పాడేరు ఘాట్‌రోడ్డు జంక్షన్ వద్ద అడ్డంకిగా కాలువపై శ్లాబ్ కర్రలు, చెక్కలు

▸▸ ఆర్‌అండ్‌బీ అధికారులు నిర్వాకంతో తిప్పలు

మాడుగుల రూరల్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): కాలువపై శ్లాబ్ కల్వర్టు నిర్మాణం కోసం డక్కింగ్ కోసం చెక్కలు, కర్రలు అడ్డంగా నిలిచి మురుగు నిల్వ ఉంటోంది. మండలంలోని ఘాట్‌రోడ్డు జంక్షన్ వద్ద పాడేరు వెళ్లే మార్గంలో గతంలో ఆర్ అండ్‌బీ అధికారులు కొత్తగా బీటీ రోడ్డు వేశారు. రోడ్డు మధ్యన మురుగు నీరు వెళ్లేందుకు డ్రైనేజీపై రెండు వైపులా మదుములు కట్టి శ్లాబ్ కల్వర్టు వేసి తారురోడ్డు వేశారు. అయితే, శ్లాబ్ కల్వర్టు కోసం డక్కింగ్ వేశారు. ఇందుకు సపోర్టుగా ఉన్న కొన్ని చెక్కలు, కర్రలు తీయకుండా వదిలేశారు. దీంతో చెత్తాచెదారం, వ్యర్థాలు కాలువలో నిలిచి పోతున్నాయి. పంచాయతీ అధికారులు పలుమార్లు కాలువలో వ్యర్థాలు తొలగించినా రోడ్డుకింద ఉన్న డ్రైనేజీలో చెత్తాచెదారం తీయలేకపోతున్నారు. ఈ క్రమంలో దుర్గంధం వెదజల్లడంతో పాటు దోమలు బెడద ఎక్కువైందని స్థానిక సమీప దుకాణదారులు, నివాసితులు వాపోతున్నారు. ఆర్‌అండ్‌బీ అధికారులకు చెప్పినా పట్టించుకోవడం లేదని ఆరోపిస్తున్నారు. ఇకనైనా స్పందించి డ్రైనేజీలో చెక్కలు, కర్రలు తొలగించి సమస్య పరిష్కరించాలని విజ్ఞప్తి చేస్తున్నారు.



మూసుకుపోయిన కల్వర్టు



నిలిచిన మురుగునీరు, చెత్త చెదారం

## ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలి



రైతులకు మొక్కలు పంపిణీ చేస్తున్న తెలుగు మహిళా నేత నీలవేణి, తదితరులు

రావికమతం, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ విరిగా మొక్కలు నాటి పచ్చదనాన్ని పరిరక్షించాలని తెలుగు మహిళ నియోజవర్గ అధ్యక్షురాలు కోట నీలవేణి పిలుపు నిచ్చారు. మండలంలోని కొత్తకోటలో స్వయం కృషి రైతు ఉత్పత్తిదారుల కో ఆపరైటివ్ సొసైటీ ఆధ్వర్యంలో విశాఖ పోర్టు ఎస్‌బీడీఎస్ సహకారంతో అందించిన 12 రకాల వివిధ పండ్ల జాతి మొక్కలను రైతులకు ఆమె ఉచితంగా ఆదివారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాతూ, జనాభా పెరుగుదలతో అడవులు అంతరించిపోతుండడంతో కాలుష్యం పెరిగిపోతోందన్నారు.ఈ స్థితిలో మొక్కలు నాటాలన్నారు.ఈ కార్యక్రమంలో టీడీపీమండల ప్రధాన కార్యదర్శి ఉగ్గిన శ్రీను, ఉప సర్పంచ్ పందల దేవా, నాయకులు కోట సత్యనారాయణ, పీఏసీఎస్ సీఈవో జి.రఘు, సంస్థ ప్రతి నిధులు విస్సారపు వెంకట రమణ, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## ఎన్ఎస్ఎస్ సేవా కార్యక్రమాలు





అంకుపాలెంలో ర్యాలీ చేస్తున్న విద్యార్థులు

చోడవరం, డిసెంబరు7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గాంధీ గ్రామం, అంకుపాలెం పంచాయతీల్లో స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ విద్యార్థులు ఆదివారం సేవా కార్యక్రమాలు నిర్వహించారు. పరిసరాల పరిశుభ్రతతో పాటు, వివిధ కార్యక్రమాలపై స్థానికులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి బుర్రి కుమార్ రాజు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కార్యక్రమంలో స్థానిక సర్పంచ్‌లు గాడి అప్పారావు, పరమేశ్వరి ఎన్ ఎస్ ఎస్ ప్రోగ్రాం ముఖ్య అధికారిణి భాగ్యలక్ష్మి, ఎన్ఎస్ఎస్ పీవోలు బి.పిచ్చమ్మ, రత్నభారతి, తదితరులు పాల్గొన్నారు. విద్యార్థులకు సర్టిఫికెట్లు పంపిణీ చేశారు.

## భగవద్గీత పఠన పోటీలు

కె.కోటపాడు, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): విశ్వహిందూ పరిషత్తు భారత సంస్కృతి విభాగం ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయి భగవద్గీత 12వ అధ్యాయ పఠన పోటీలు ఆదివారం స్థానిక రామాలయంలో నిర్వహించారు. పోటీల్లో పాల్గొన్న ప్రతి విద్యార్థికీ కన్సొలేషన్ బహుమతితో పాటు గెలుపొందిన వారికి భగవద్గీత గ్రంథాన్ని అందించారు. పూసవర్తిని, పాటూరి జానకి ఆధ్వర్యంలో తులసి, వెంకట పద్మజ, సత్యవతి సమక్షంలో జరిగిన ఈ పోటీల్లో 40 మంది విద్యార్థులు పాల్గొన్నారు.

# ఆర్ఎస్ఎస్ పంచ పరివర్తనలతో దేశాభివృద్ధి

▸▸ ప్రచార ప్రముఖ్ భయ్యావాసు

కె.కోటపాడు, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): దేశ అభివృద్ధికి ఆర్ఎస్ఎస్ ప్రబోధించిన పంచ పరివర్తనలు ఆచరించాలని శుభమస్తు షాపింగ్ మాల్స్ అధినేత, ఆర్ఎస్ఎస్ ప్రాంత ప్రచార ప్రముఖ్ భయ్యావాసు కోరారు. ఆదివారం స్థానిక శివాలయం ఆవరణలో హిందూ సమ్మేళనం జరిగింది. ప్రముఖ ఆధ్యాత్మిక గురువు ఆంజనేయస్వామి మాలధారుల గురుస్వామి రొంగలి పరశురాం ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఈ కార్యక్రమంలో భయ్యావాసు మాట్లాడారు. స్వదేశీ వస్తువులు వినియోగం, దేశవాళీ ఆవుల సంరక్షణ గో ఆధారిత సేంద్రియ వ్యవసాయ విధానాలతో గ్రామాల వికాసం సాధ్యమవుతుందన్నారు. అన్ని కులాల వారికి ఒకే విధంగా దైవదర్శనం, తాగునీరు, శ్మశానాల్లో స్థానం కల్పించాలన్నారు. స్వదేశీ జీవనశైలిని ప్రతి వ్యక్తి అవలంబించగలిగితే దేశం ఆత్మ నిర్భర భారత్ అవుతుందని తెలిపారు. ప్రభుత్వానికి పన్నులు, సేవా రుసుంలు చెల్లించి దేశాభివృద్ధికి తోడ్పాటునందించాలని కోరారు. ఈ సందర్భంగా ఎస్. కోట మండలం సీతంపేట, కె.కోటపాడు గ్రామాలకు చెందిన మహిళా కోలాటం, కె. కోటపాడుకు చెందిన కాంగో వాయిద్యాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఆర్ఎస్ఎస్ విభాగ్ కార్య వాహ ప్రసాదనాయుడు, స్థానిక సర్పంచ్ ఎర్రంశెట్టి భవాని, చౌడువాడ, గొండుపాలెం, కె.కోటపాడు, పైడంపేట తదితర గ్రామాలకు చెందిన హిందువులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఆర్ఎస్ఎస్ ప్రాంత ప్రచార ప్రముఖ్ భయ్యావాసు

## లక్ష్మీపురంలో ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం



కొనుగోలు కేంద్రం ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్ రాజు

చోడవరం, డిసెంబరు7(ఆంధ్రజ్యోతి): మండలంలోని లక్ష్మీపురంలో ఆదివారం ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని స్థానిక ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్ రాజు ప్రారంభించారు. డీఆర్‌డీఏ ఆధ్వర్యంలో స్థానిక రైతు కేంద్రంలో ఏర్పాటు చేసిన ఈ కేంద్రంలో ధాన్యం కొనుగోలు శ్రీకారం చుట్టారు. ఈ కార్యక్రమంలో వెలుగు ఏపీఎం బి. తిలక్, స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## శ్రీకృష్ణ ఆలయ నిర్మాణానికి స్థలం విరాళం



భూమి పత్రాలు అందిస్తున్న దాతలు

బుచ్చెయ్యపేట డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): మండలంలో కేపీ అగ్రహారంలో శ్రీకృష్ణ ఆలయ నిర్మాణానికి అవసరమైన భూమిని గ్రామానికి చెందిన వియ్యపు ముసిలి కుమారులు రాజుబాబు, వియ్యపు అప్పారావు విరాళంగా అందజేశారు. ఈమేరకు ఆదివారం స్థానిక నాయకులు, ఎం పీటీసీసభ్యులు దేవర అప్పారావు, అడ్డూరి శ్రీను, మల్లి ఈశ్వరరావు స్థలం రాతపూర్వక ధ్రువపత్రాలు అందచేశారు. ఈ కార్యక్రమంలో వియ్యపు గణేష్, గొలగాని అప్పారావు, సోము నాయుడు, అప్పారావు, తదితరులు పాల్గొన్నారు.

## తాగునీటి బోరు నిర్మాణానికి శంకుస్థాపన



ఖండివరంలో భూమి పూజ చేస్తున్న టీడీపీ నాయకులు

చీడికాడ, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): ఖండివరంలో ఖండివరంలో లెక్కలవారి కళ్లాల వద్ద తాగునీటిబోరు నిర్మాణానికి మాజీ ఎంపీపీ కుచ్చు కళావతి ఆదివారంశంకుస్థాపన చేశారు. ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి నిధులతో ఈ బోరు ఏర్పాటు చేస్తున్నట్టు ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు బండారు దయాకర్, సింగంపల్లి పెదనాయుడు, రైతులు పాల్గొన్నారు.